RNI No: TGTEL/25/A2649

VOICE OF PRAJALU

# వాయిస్ ఆఫ్ ప్రజలు

ప్రజల గొంతుక - నిజం కోసం..

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMABAD ADILABAD

హైదరాబాద్ | బుధవారం, జూన్ 24, 2026 | తెలుగు దినపత్రిక | సంపుటి:1 | సంచిక : 63 | పేజీలు: 8 | వెల : రూ.1



స్కీం వెనుక స్కాం: కేటీఆర్




## కళలు, సంస్కృతి పరిరక్షణకు సంయుక్తంగా ముందుకు సాగాలి

### ::: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్: రాష్ట్రంలో ప్రాచీన కళలు, సంస్కృతిని పరిరక్షించడంతో పాటు కళాకారులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పర్యాటక, దేవాదాయ, సాంస్కృతిక శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచించారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతీలో ఘనంగా నిర్వహించిన అర్ధనారీశ్వరం జాతీయ నృత్యోత్సవం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గతంలో దేవాలయ ప్రాంగణాలే అన్ని కళారూపాలకు ప్రధాన వేదికలుగా ఉండేవని ఆయన గుర్తుచేశారు. నృత్యం, కళారూపాల ద్వారా భక్తి, సామాజిక సందేశాలను ప్రజలకు సులభంగా చేరవేసిన విధానాన్ని ప్రశంసించారు. సాంస్కృతిక, పర్యాటక, దేవాదాయ శాఖలు కలిసి కార్యక్రమాలు నిర్వహిస్తే తెలంగాణలో విశేష ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. కేరళ తరహాలో పర్యాటక ప్రాంతాల్లో స్థానిక కళారూపాల ప్రదర్శనకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన సూచించారు. సాయంత్రం వేళల్లో పర్యాటక కేంద్రాల్లో సంప్రదాయ కళారూపాలను ప్రదర్శిస్తే పర్యాటకులకు వినోదంతో పాటు కళాకారులకు ఉపాధి, గుర్తింపు లభిస్తుందని తెలిపారు. దేవాలయాలు, పర్యాటక ప్రాంతాల్లో కళల ప్రోత్సాహానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అర్ధనారీశ్వరం భావన పురుషాధిక్యతకు కాకుండా స్త్రీ, పురుష సమానత్వానికి

(మిగతా 2వ పేజీలో)

## ఏపీలో రిటైర్మెంట్ వయస్సు 62



విజయవాడ జూన్ 23, (వాయిస్ టుడే) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం తిరుగులేని తీపి కబురు అందించింది. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల డిమాండ్‌ను పరిష్కరిస్తూ, వారి పదవీ విరమణ వయసును 60 ఏళ్ల నుంచి 62 ఏళ్లకు పెంచుతూ ప్రభుత్వం సంచ లన నిర్ణయం తీసుకుంది. సచివా లయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఈ ప్రతి పాదనకు అధికారికంగా ఆమోద ముద్ర వేశారు. ప్రభుత్వ తీసుకున్న ఈ నిర్ణయం వల్ల రాష్ట్రవ్యాప్తంగా వివిధ విభాగాల్లో పనిచేస్తున్న వేలాది మంది ఉద్యోగులకు నేరుగా లబ్ధి చేకూరనుంది. గతంలో రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయసును పెంచినప్పటికీ, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే సిబ్బందిని అప్పటి ప్రభుత్వం విస్మరించింది. అయితే, తాజా కేబినెట్ నిర్ణయంతో రాష్ట్రంలోని ప్రభుత్వ రంగ సంస్థలు , వివిధ ప్రభుత్వ కార్పొరేషన్లు, ప్రభుత్వ గుర్తింపు పొందిన సొసైటీలు, కంపెనీలతో పాటు సాంఘిక, గిరిజన, బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఇతర నాన్-టీచింగ్ సిబ్బంది అందరికీ ఈ వయోపరిమితి పెంపు వర్తించనుంది. రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వీరికి కూడా 62 ఏళ్ల వరకు సర్వీసులో కొనసాగే అవకాశం లభించడంతో ఉద్యోగ వర్గాల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఈ వయోపరిమితి పెంపును ప్రభుత్వం వెనుకటి తేదీ అనగా 2022 జనవరి 1వ తేదీ నుంచే అమలు చేయాలని నిర్ణయించింది. . దీనివల్ల ఇప్పటికే 60 ఏళ్లు నిండి పదవీ విరమణ చేసినప్పటికీ, ప్రస్తుతం 62 ఏళ్ల లోపు వయసు ఉన్న సిబ్బందిని తిరిగి విధుల్లోకి ఆహ్వానించనున్నారు. పదవీ విరమణకు కేవలం 3 నెలల సమయం ఉన్నా సరే వారు మళ్లీ సర్వీసులో చేరవచ్చు. ఇక ఇప్పటికే 62 ఏళ్లు కూడా పూర్తి చేసుకున్న రిటైర్డ్ ఉద్యోగులకు నోషనల్ ప్రయోజనాలు కల్పిస్తారు, దీని ద్వారా వారికి వచ్చే నెలవారీ పెన్షన్ మొత్తం గణనీయంగా పెరగనుంది. ప్రభుత్వం తీసుకున్న ఈ చారిత్రాత్మక నిర్ణయం వల్ల దాదాపు 15,000 మంది ప్రభుత్వ రంగ, కార్పొరేషన్ల ఉద్యోగులకు

(మిగతా 2వ పేజీలో)



## ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌ను అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేయాలి

### ::: కేంద్ర రక్షణ మంత్రికి సీఎం రేవంత్ విజ్ఞప్తి


న్యూఢిల్లీ: ఆదిలాబాద్‌లో భారత వాయుసేన (IAF) ఆధ్వర్యంలో నిర్మించనున్న విమానాశ్రయాన్ని అన్ని ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి ాూ. =వఝుఅ్ష్ట్ర =వ౧౧౨ కేంద్ర రక్షణ మంత్రి Rajnath Singhను కోరారు. ఢిల్లీలోని కర్తవ్య భవన్‌లో జరిగిన భేటీలో ఈ అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం రక్షణ శాఖ భూములను బదలాయించినందుకు సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి అవసరమైన భూసేకరణ, యుటిలిటీల బదలాయింపు వంటి అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. భారత వాయుసేన టెర్మినల్‌తో పాటు పౌర విమానయాన శాఖ టెర్మినల్, కార్గో, ఎంఆర్‌వో (MRO), హ్యాంగర్ సదుపాయాలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరారు. అంతర్జాతీయ ఎయిర్‌లైన్స్ హ్యాంగర్‌ల ఏర్పాటుకు ఆదిలాబాద్ అనుకూల ప్రాంతమని పేర్కొంటూ, ఆ దిశగా విమానాశ్రయాన్ని అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే డీఆర్‌డీవో/డీఆర్‌డీఎల్ కీలక ప్రాజెక్టు కోసం ణవఝుతీఖుఝుణతీఖు సమీప ప్రాంతాన్ని ఎంపిక చేసిన నేపథ్యంలో, ఆ ప్రాజెక్టుకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర రక్షణ మంత్రిని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సెల్ఫ్ గోల్ చేసుకుంటున్న కవిత



హైదరాబాద్, జూన్ 23 (వాయిస్ టుడే ) : నీ బలం , సామర్థ్యం ఎంతో తెలియాలంటే నీ ప్రత్యర్థిని బట్టే తెలుస్తుంది. అంటే నీవు ఎంచుకునే ప్రత్యర్థిని బట్టే నీ స్థాయి ఖరారవుతుంది. రాజకీయాల్లో ఇది వంద శాతం నిజం. తెలంగాణ రక్షణ సేన పేరుతో రాజకీయం చేస్తున్న కల్వకుంట్ల కవిత ఉద్యమకారిణి తరహా రాజకీయ నేత అయ్యేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఇక్కడే బెడిసికొట్టాయి. తెలంగాణలో కనీస ఉనికి లేని జనసేన పార్టీని ఆమె ప్రత్యర్థిగా ఎంచుకున్నారు. రోజూ పవన్ పై విమర్శలు చేస్తూ.. అదే రాజకీయంగా గడిపేస్తున్నారు. రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ తో మూడు రోజుల పాటు సుదీర్ఘంగా మేథోమథనం జరిపి.. తన సరికొత్త పార్టీ స్ట్రాటజీని, భవిష్యత్తు యాక్షన్ ప్లాన్‌ను, ప్రజల్లోకి వెళ్లే వినూత్న లైన్‌ను ఆమె సిద్ధం చేసుకున్నట్లు పొలిటికల్ సర్కిల్స్‌లో పెద్ద ప్రచారమే జరిగింది. కానీ, ఆ కాన్సెప్టులను, పీకే ఇచ్చిన గైడ్‌లైన్స్‌ను ఆమె ఎంతవరకు ఒంటబట్టించుకున్నారనేది ఇప్పుడు పెద్ద ప్రశ్నార్థకంగా మారింది. పీకే మార్క్ పాజిటివ్ పాలిటిక్స్ ను పక్కనబెట్టి, ఆమె ఎంచుకున్న సరికొత్త పొలిటికల్ లైన్ చూసి సొంత పార్టీ శ్రేణులే ముక్కున వేలేసుకుంటున్నాయి. తెలంగాణ రాజకీయాల్లో సెంటిమెంట్‌ను రగిల్చాలన్నా, రాజకీయంగా మైలేజ్ సాధించాలన్నా ఇప్పటికీ నారా చంద్రబాబు నాయుడును టార్గెట్ చేయడం ఒక సంప్రదాయ ఆయుధంగా వస్తోంది. చంద్రబాబును బూచిగా చూపిస్తే తెలంగాణ సమాజంలో కొంతవరకు పొలిటికల్ అడ్వాంటేజ్ పొందే అవకాశం ఉండేది. కానీ కవిత మాత్రం ఊహించని విధంగా, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను టార్గెట్ చేసుకుని తన విమర్శల పదును పెంచారు. తెలంగాణకు, ఇక్కడి రాజకీయ సమీకరణాలకు పెద్దగా సంబంధం లేని పవన్ కల్యాణ్ చుట్టూ కవిత రాజకీయం తిప్పడం వెనుక ఏ రకమైన వ్యూహం ఉందో ఎవరికీ అర్థం కావడం లేదు. పవన్ కల్యాణ్‌పై పోరాటం చేయడం వల్ల కవితకు రాజకీయంగా కలిసి వచ్చే శక్తులు గానీ, సామాజిక వర్గాలు గానీ లేవు. పవన్ కల్యాణ్ ఎక్కడో అన్న మాటలను పట్టుకుని, వాటిని తెలంగాణకు ఆపాదించి, ఇక్కడి ప్రజలను భావోద్వేగాల వైపు రెచ్చగొట్టాలని ఆమె చూస్తున్నారు. దీని ద్వారా తన వ్యక్తిగత బలాన్ని, ఉనికిని పెంచుకోవచ్చని భావిస్తున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో ఆమెకు

(మిగతా 2వ పేజీలో)



## సాయికృష్ణ కేసులో సీఐ నాగరాజు అరెస్ట్!

### తీవ్ర ఉద్రిక్తతల మధ్య అదుపులోకి తీసుకున్న సిట్

విజయవాడ,జూన్ 23, (వాయిస్‌టుడే) : సంచలనం రేపిన సాయికృష్ణ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. కృష్ణలంక మాజీ సీఐ నాగరాజును సిట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం ఉదయమే సిట్ అధికారులు విజయవాడలోని సీఐ నాగరాజు ఇంటికి వెళ్లారు. అయితే సీఐ నాగరాజును అరెస్ట్ చేయవద్దంటూ ఆయన మద్దతుదారులు ఉదయం నుంచి ఇంటి వద్ద ఆందోళకు దిగారు. అయితే పోలీసు సాయంతో సిట్ అధికారులు సీఐ నాగరాజును నివాసంలోకి అతికష్టం మీద వెళ్లారు. కేసు విషయమై కొన్ని గంటలపాటు ప్రశ్నించిన అనంతరం సిట్ అధికారులు సీఐ నాగరాజును అదుపులోకి తీసుకుని పోలీస్ గెస్ట్ హౌస్‌కు తరలిస్తున్నారు. అక్కడికి తీసుకెళ్లి సాయికృష్ణను కస్టడీకి ఎప్పుడు తీసుకున్నారు, ఏం జరిగిందని సిట్ అధికారులు పూర్తి స్థాయిలో విచారించనున్నారు. నాగరాజును అదుపులోకి తీసుకునేందుకు సిట్ అధికారులు ముందుగానే వాహనం సిద్ధం చేసుకుని రావడంతో సీఐకి మద్దతుగా భారీ ఎత్తున

(మిగతా 2వ పేజీలో)

## ఒలింపిక్ స్ఫూర్తిని ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలి: మంత్రి వాకిటి శ్రీహరి




తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఒలింపిక్ డే రన్-2026 కార్యక్రమంలో రాష్ట్ర క్రీడా, యువజన సేవల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. నగరంలోని ఎల్‌బీ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు జితేందర్ రెడ్డి, సాట్స్ చైర్మన్ శివసేన రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేణుగోపాలచారి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, నగరం నలుమూలల నుంచి ఒలింపిక్ జ్యోతిని తీసుకువచ్చిన ప్రతి క్రీడాకారుడికి అభినందనలు తెలిపారు. ప్రతి ఒక్కరిలో ఒలింపిక్ స్ఫూర్తిని నింపే లక్ష్యంతో ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఒలింపిక్ డే రన్ నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఒలింపిక్ డే రన్ కేవలం క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించడమే కాకుండా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి దోహదపడుతుందని మంత్రి అన్నారు. క్రమశిక్షణతో కూడిన క్రీడాకారులే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించగలరని, మిలిటరీ సైనికులకు ఉన్నంత క్రమశిక్షణ క్రీడాకారులకు కూడా ఉండాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం గత రెండున్నర సంవత్సరాల్లో క్రీడలకు అపూర్వ ప్రాధాన్యతనిస్తూ

(మిగతా 2వ పేజీలో)

## అంతరాష్ట్ర బదిలీలకు గ్రీన్‌సిగ్నల్




హైదరాబాద్, జూన్ 23 (వాయిస్ టుడే ) : ఏపీ, తెలంగాణ రాష్ట్రాల విభజన అనంతరం పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల అంతర్‌రాష్ట్ర బదిలీల అంశం మరోసారి తెరపైకి వచ్చింది. ఏపీలో పనిచేస్తున్న 891 మంది ఉద్యోగులు తెలంగాణకు శాశ్వత బదిలీ కోరుతూ సుముఖత వ్యక్తం చేయగా, వారి జాబితాను ఏపీ ప్రభుత్వం తెలంగాణకు పంపించింది. ఈ ప్రతిపాదనకు తెలంగాణ ప్రభుత్వం అంగీకారం తెలిపితే దాదాపు 12 ఏళ్లుగా కొనసాగుతున్న ఉద్యోగుల సమస్యకు పరిష్కారం లభించే అవకాశం ఉంది. ఇదే సమయంలో రాష్ట్రస్థాయి కార్యాలయాల ఉద్యోగులకు వారంలో ఐదు రోజుల పనిదినాల విధానాన్ని మరో ఏడాది పొడిగిస్తున్నట్లు ఏపీ ప్రభుత్వం ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల అంతర్‌రాష్ట్ర బదిలీల ప్రక్రియ మళ్లీ తెరపైకి వచ్చింది. రెండు రాష్ట్రాల విభజన తర్వాత విభజన చట్టం ప్రకారం శాశ్వత ప్రాతిపదికన ఏపీలో పని చేస్తున్న 891 మంది ఉద్యోగులు

## అమెరికా ఫ్రీడమ్ 250" వేడుకల్లో డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్ : వాయిస్ టుడే అమెరికా స్వాతంత్ర్యం 250 ఏళ్లు పూర్తైన సందర్భంగా హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సులేట్‌లో నిర్వహించిన "ఫ్రీడమ్ 250" వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక మరియు విద్యుత్ శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి అమెరికా రాయబారి సర్జియో గోర్, యూఎస్ కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్,

(మిగతా 2వ పేజీలో)



వాయిస్ ఆఫ్ ప్రజలు

బుధవారం, జూన్ 24, 2026

# సాయికృష్ణ కేసులో సీఐ నాగరాజు అరెస్ట్!

స్థానికులు, మద్దతుదారులు వచ్చారు. నాగరాజును అరెస్ట్ చేసే అవకాశం ఉందని, అదుపులోకి తీసుకుంటారేమోనని గత మూడు రోజులుగా మాజీ సీఐ ఇంటి వద్దకు మద్దతుదారులు వచ్చి సంఘీభావం తెలుపుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి క్యాండిల్ ర్యాలీ సైతం నిర్వహించడం తెలిసిందే. ఆయన వల్లే ఏరియాలో మహిళలు ధైర్యంగా బయట తిరుగుతున్నారని, సీఐ నాగరాజు వచ్చాకే పరిస్థితిలో చాలా మార్పుల వచ్చిందన్నారు. సాయికృష్ణ అదృశ్యం కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణను ముమ్మరం చేసింది. సిట్ సభ్యులు సోమవారం (జూన్ 22న) కృష్ణలంకలోని సాయికృష్ణ నివాసం, పోలీస్ స్టేషన్, స్వర్గపురి శ్మశానవాటికలను స్వయంగా పరిశీలించారు. సాయికృష్ణ తల్లితో పాటు మేనమామలు, కుటుంబ సభ్యులను సుమారు 6 గంటల పాటు విచారించి వాంగ్మూలాలను నమోదు చేసుకున్నారు. పోలీసులు సాయికృష్ణను స్టేషన్‌లో చిత్రహింసలు పెట్టి చంపేసి, ఆధారాలు లేకుండా మృతదేహాన్ని దహనం చేశారని కుటుంబ సభ్యులు సిట్‌కు తెలిపారు. అనంతరం క్లూస్ టీమ్, ఫోరెన్సిక్ బృందంతో కలిసి కృష్ణలంక పోలీస్ స్టేషన్‌ను సిట్ అధికారులు ఆమూలాగ్రం తనిఖీ చేశారు. సిబ్బంది స్టేట్‌మెంట్లు, వేలిముద్రలను సిట్ అధికారులు సేకరించారు. శ్మశానవాటిక వద్ద కాపరిని కూడా విచారించి, పరిసరాల్లోని సీసీ కెమెరాల వివరాలను ఆరా తీశారు.



**సీసీటీవీ ఫుటేజీలు మాయం కావడంతో ఉత్కంఠ..**

అయితే, సాయికృష్ణ కేసులో అత్యంత కీలకమైన పోలీస్ స్టేషన్ సీసీటీవీ ఫుటేజీలు మాయమవడంతో ఏం జరుగుతుందోనని ఉత్కంఠ నెలకొంది. సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం 18 నెలల ఫుటేజీ భద్రపరచాల్సి ఉండగా, దాదాపు ఏడాది కాలపు దృశ్యాలను తొలగించినట్లు సిట్ గుర్తించింది. కోర్టు ఆదేశాల ప్రకారం హార్డ్ డిస్క్, డీవీఆర్‌లను సీజ్ చేసి పరిశీలించగా.. కేవలం 2 రోజుల ఫుటేజీ మాత్రమే లభ్యమైంది. కేసు నుంచి తప్పించుకునేందుకు మాజీ సీఐ నాగరాజు స్థానిక టెక్నీషియన్‌తో ఈ వీడియోలను తొలగించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే సిట్ అదికారులు డేటా రికవరీ కోసం ఈ డేటాను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న ఏపీ ప్రభుత్వం ప్రొవిజన్స్ అండ్ లాజిస్టిక్స్ విభాగం ఐజీ ఎం.రవిప్రకాశ్ నేతృత్వంలో సిట్ ఏర్పాటు చేసింది. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్, పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ, బాపట్ల జిల్లా అదనపు ఎస్పీ ఎల్.సుధాకర్‌లను సిట్ సభ్యులుగా నియమిస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. అయితే అదేరోజు సీఐ నాగరాజును అరెస్ట్ చేస్తారని ప్రచారం జరగగా, ఆయనకు మద్దతుగా రాత్రిపూట కొందరు మహిళలు స్థానికంగా క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు.

# అమెరికా ఫ్రీడమ్ 250" వేడుకల్లో డిప్యూటీ సీఎం భట్టి

అమెరికా ప్రభుత్వ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, పరిశ్రమల ప్రముఖులు, విద్యార్థులు, మీడియా ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ అమెరికా దేశం స్వేచ్ఛ, ఆవిష్కరణ, పారిశ్రామికతతో ప్రపంచానికి ప్రేరణగా నిలుస్తోందని తెలిపారు. తెలంగాణ--అమెరికా సంబంధాలు కేవలం దౌత్య పరమైనవే కాకుండా విద్య, ఉపాధి, వ్యాపారం, పరిశోధన, సాంస్కృతిక మార్పిడి ద్వారా ప్రజల జీవితాలతో ముడిపడి ఉన్నాయని పేర్కొన్నారు. హైదరాబాద్ ప్రపంచ స్థాయి ఐటీ హబ్‌గా ఎదిగిందని, మైక్రోసాఫ్ట్ సంస్థ తొలిసారిగా నగరంలో కార్యకలాపాలు ప్రారంభించడం ఈ అభివృద్ధికి దారితీసిందని గుర్తు చేశారు. సత్య నాదెళ్ల మైక్రోసాఫ్ట్ సీఈఓగా ఎదగడం హైదరాబాద్--అమెరికా బంధానికి ప్రతీకగా నిలిచిందని తెలిపారు. మాజీ అమెరికా అధ్యక్షులు బిల్ క్లింటన్, జార్జ్ డబ్ల్యూ బుష్ హైదరాబాద్ పర్యటనలను కూడా ఆయన గుర్తు చేశారు. హైదరాబాద్ టెక్నాలజీ, ఆరోగ్యం, విద్య, వ్యవసాయం రంగాల్లో అంతర్జాతీయ గుర్తింపు పొందిందని చెప్పారు. పాగాహ్ ప్యాలెస్ నుండి ప్రస్తుత ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వరకు అమెరికా కాన్సులేట్ మార్పు హైదరాబాద్ అభివృద్ధిని ప్రతిబింబిస్తుందని అన్నారు. పాగాహ్ సమాధుల పునరుద్ధరణకు అమెరికా సహకారం అందించిందని ప్రశంసించారు. వ్యవసాయం, జీవ విజ్ఞానం, టీకాలు, అంతరిక్ష రంగం, ఆధునిక తయారీ పరిశ్రమల్లో అమెరికాతో తెలంగాణ భాగస్వామ్యం మరింత బలపడుతోందని తెలిపారు. ఔట్‌సోర్సింగ్ దశ నుండి ఇప్పుడు "కో--క్రియేషన్" దశకు చేరుకున్నామని చెప్పారు. అమెరికాలో తెలుగు మాట్లాడే సమాజం వేగంగా పెరుగుతోందని, ఇది తెలంగాణ--అమెరికా మధ్య బలమైన ప్రజల సంబంధాలకు నిదర్శనమని పేర్కొన్నారు. కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్ తెలుగు మాట్లాడడాన్ని కూడా ఆయన ప్రశంసించారు. భవిష్యత్తులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, స్వచ్ఛ ఇంధనం, ఎలక్ట్రిక్ వాహనాలు, ఉన్నత విద్య, పరిశోధన రంగాల్లో సహకారం మరింత పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. యూఎస్




కాన్సులేట్ సమీపంలో ఒక రహదారికి "డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ"గా పేరు పెట్టే ప్రతిపాదనను కూడా ఆయన ప్రస్తావించారు. ఇది తెలంగాణ--అమెరికా స్నేహానికి గుర్తుగా నిలుస్తుందని తెలిపారు. అమెరికా ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలపరచేందుకు తెలంగాణ కట్టుబడి ఉందని భట్టి విక్రమార్క అన్నారు.

# ఏసీబీ వలలో మరో పెద్ద చేప... నిజామాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ అరెస్ట్.. రూ.3 కోట్ల అక్రమాస్తులు గుర్తింపు

**ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో నిజామాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ అరెస్ట్**

**మల్లారెడ్డి, ఆయన బంధువుల ఇళ్లపై ఏసీబీ ఏకకాలంలో దాడులు**

**సుమారు రూ.3 కోట్ల విలువైన అక్రమాస్తులు గుర్తించిన అధికారులు**

**ఇటీవలే సర్వే శాఖ అధికారి నరహరిని అరెస్ట్ చేసిన ఏసీబీ**

**వరుస దాడులతో అవినీతి అధికారుల్లో కలవరం**

తెలంగాణలో అవినీతి అధికారులపై ఏసీబీ (అవినీతి నిరోధక శాఖ) వరుస దాడులు కొనసాగిస్తోంది. తాజాగా, ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో నిజామాబాద్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కొమ్మురి మల్లారెడ్డిని ఏసీబీ అధికారులు మంగళవారం అరెస్ట్ చేశారు. అవినీతి కార్యకలాపాలకు పాల్పడి, అక్రమ మార్గాల్లో ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణలతో మల్లారెడ్డిపై ఏసీబీ కేసు నమోదు చేసింది. ఇందులో భాగంగా మంగళవారం మల్లారెడ్డి నివాసంతో పాటు ఆయన బంధువులు, బినామీలకు చెందిన మొత్తం 10 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. ఈ సోదాల్లో ఐదు భవనాలు (నాలుగు ఇళ్లు, ఒక వాణిజ్య సముదాయం), 8 ఖాళీ ప్లాట్లు, 10.23 ఎకరాల వ్యవసాయ భూమిని అధికారులు గుర్తించారు. వీటితో పాటు రూ.3.31 లక్షల



నగదు, బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.50 లక్షలు, ఒక గ్రాండ్ విటారా కారు, ఒక టీవీఎస్ స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆస్తుల డాక్యుమెంట్ విలువ సుమారు రూ.3 కోట్లు ఉండగా, బహిరంగ మార్కెట్‌లో వీటి విలువ చాలా రెట్లు అధికంగా ఉంటుందని ఏసీబీ అంచనా వేస్తోంది. మల్లారెడ్డి భార్య, కుటుంబ సభ్యుల పేర్లపై ఉన్న మూడు బ్యాంక్ లాకర్లను కూడా గుర్తించామని, వాటిని విచారణలో భాగంగా త్వరలోనే తెరుస్తామని అధికారులు తెలిపారు. నిందితుడిని ఏసీబీ కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించనున్నారు. వారం రోజుల క్రితమే ల్యాండ్స్ అండ్ సర్వేస్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరిని కూడా ఏసీబీ ఇలాగే అక్రమాస్తుల కేసులో అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. నరహరి కేసులో సుమారు రూ.13 కోట్లకు పైగా ఆస్తులు, రూ.1.54 కోట్ల నగదు, భారీగా బంగారం వెలుగుచూశాయి. వరుస అరెస్టులతో అవినీతి అధికారుల్లో కలవరం మొదలైంది.

# విశాఖకు చెందిన యువ వైద్యుడు హైదరాబాద్‌లో సూసైడ్

**హైదరాబాద్ మల్లాపూర్‌లోని ఆసుపత్రిలో డ్యూటీ డాక్టర్ ఆత్మహత్య**

**విషం ఇంజెక్ట్ చేసుకుని ప్రాణాలు తీసుకున్నట్లు పోలీసుల వెల్లడి**

**అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు**



హైదరాబాద్ : హైదరాబాద్‌లో విషాదకర ఘటన చోటుచేసుకుంది. మల్లాపూర్‌లోని రికవర్ ఆసుపత్రిలో డ్యూటీ డాక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఖాసీఫ్ అహ్మద్ (28) సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆసుపత్రిలోని స్టాఫ్ రూమ్‌లోనే ఆయన విషపూరిత ఇంజెక్షన్ తీసుకుని బలవన్మరణానికి పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు. సోమవారం రాత్రి నుంచి డాక్టర్ ఖాసీఫ్ స్టాఫ్ రూమ్ నుంచి బయటకు రాకపోవడంతో ఆసుపత్రి సిబ్బందికి అనుమానం కలిగింది. తలుపులు తట్టినా లోపలి నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో, వారు తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లి చూడగా ఆయన విగతజీవుడిలా కనిపించారు. దీంతో సిబ్బంది వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంకు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. బాలాపూర్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ఎం. సుధాకర్ వెల్లడించిన వివరాల ప్రకారం, డాక్టర్ ఖాసీఫ్ విషపూరిత ఇజెక్షన్ వేసుకోవడం వల్లే మరణించి ఉంటారని ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ ఘటనపై భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) సెక్షన్ 194 కింద అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## స్కీం వెనుక స్కాం: కేటీఆర్



హైదరాబాద్ జూన్ 23, (వాయిస్ టుడే ) : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర ఆరోపణలు చేశారు. రేవంత్ రెడ్డికి ఒక్కటే ఎజెండా ఉందని, అది మెట్రో భూముల స్కామ్ అని మండిపడ్డారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడిన కేటీఆర్, "రేవంత్ రెడ్డి కన్నంతా మెట్రో భూముల మీదే పడింది. ఏ స్కీమ్ తెచ్చినా దాని వెనుక ఒక స్కామ్ పక్కా ఉంటుంది" అని ఆరోపించారు. మెట్రో సమీపంలో 280 ఎకరాల విలువైన భూములు ఉన్నాయని, వీటి విలువ సుమారు రూ.30 వేల కోట్లు అని తెలిపారు. రేవంత్ రెడ్డి ఈ భూములను తన అన్నదమ్ములు, బావమరుదులు, అల్లుళ్లకు కట్టబెట్టడానికే మెట్రోను స్వాధీనం చేసుకున్నారని ఆరోపించారు. దీని కోసం ప్రజలపై రూ.14 వేల కోట్ల భారం మోపారని విమర్శించారు. "కేసీఆర్ ప్రభుత్వం 72 కిలోమీటర్ల మెట్రోను బ్రహ్మాండంగా నిర్మించింది. ఎయిర్‌పోర్ట్ మెట్రో టెండర్లు కూడా పూర్తి చేసి, 2023 జూన్-జులైలోనే పనులు ప్రారంభించాల్సి ఉండగా, రేవంత్ రెడ్డి వచ్చి ఎయిర్‌పోర్ట్ మెట్రోను రద్దు చేశారు. ఇది తుగ్లక్ నిర్ణయం" అని కేటీఆర్ మండిపడ్డారు. ఎయిర్‌పోర్ట్ మెట్రో కొనసాగి ఉంటే ఈ పాటికి పూర్తి అయి ఉండేదని చెప్పారు. భూసేకరణ సమస్య కూడా లేకుండా, ఔటర్ రింగ్ రోడ్డును అనుసంధానం చేసి ట్రాఫిక్ సమస్యలు తగ్గించాలని ఆలోచన చేశామని కేటీఆర్ గుర్తు చేశారు. ప్రస్తుతం కిషన్ రెడ్డి, రేవంత్ రెడ్డి ఢిల్లీలో కొత్త డ్రామా మొదలుపెట్టారని, మళ్లీ మెట్రో పనులు ప్రారంభించాలంటే 2028లో కేసీఆర్‌ను మళ్లీ సీఎంగా చేయాల్సి ఉంటుందని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

# కళలు, సంస్కృతి పరిరక్షణకు సంయుక్తంగా ముందుకు సాగాలి

ప్రతీక అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. సృష్టి కొనసాగాలంటే పురుష, స్త్రీ శక్తులు పరస్పర గౌరవంతో, సహకారంతో ముందుకు సాగాలని భారతీయ సంస్కృతి చెప్పే గొప్ప సందేశాన్ని ఈ భావన ప్రతిబింబిస్తోందని పేర్కొన్నారు. దేశం నలుమూలల నుంచి నృత్యోత్సవంలో పాల్గొన్న కళాకారులకు ఆయన అభినందనలు తెలిపారు. తెలంగాణ ఆతిథ్య సంప్రదాయాన్ని వారు మధుర జ్ఞాపకంగా తీసుకెళ్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావు సన్మానించారు. కార్యక్రమంలో సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్ అలేఖ్య పుంజాలతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# ఏపీలో రిటైర్మెంట్ వయస్సు 62

నేరుగా ప్రయోజనం చేకూరనుంది. మరో రెండేళ్ల పాటు ఉద్యోగ భద్రత లభించడంతో ఆయా కుటుంబాలకు ఆర్థికంగా ఎంతో ఆసరా దొరికినట్లయింది. అటు అనుభవజ్ఞులైన సిబ్బంది సేవలను మరికొంత కాలం ఉపయోగించుకోవడానికి ఈ నిర్ణయం ప్రభుత్వానికి కూడా ఎంతగానో దోహదపడనుంది. ఈ కీలక కేబినెట్ భేటీలో కేవలం రిటైర్మెంట్ వయసు పెంపు మాత్రమే కాకుండా.. 'ఏపీ ఏవియేషన్ పాలసీ-2026', అమరావతి ఐ ప్రాజెక్ట్, విశాఖ-చీరాల తీరాల్లో 'బీచ్ షాక్స్' ఏర్పాటు వంటి పలు కీలక నిర్ణయాలకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. చాలా కాలంగా తమ హక్కుల కోసం పోరాడుతున్న కార్పొరేషన్, గురుకుల ఉద్యోగుల పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మానవీయ కోణంలో స్పందించి జీవో జారీకి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంపై ఏపీఎన్జీవో సంఘాలు, వివిధ ఉద్యోగ జేఏసీ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగుల పట్ల చిత్తశుద్ధితో వ్యవహరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు, మంత్రివర్గ ఉపసంఘానికి ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# సెల్ఫ్ గోల్ చేసుకుంటున్న కవిత

లభిస్తున్న మద్దతు శూన్యం. పవన్‌ను వ్యతిరేకించడం ద్వారా తెలంగాణలో ఎలాంటి పొలిటికల్ డివిడెండ్స్ రావనే కనీస లాజిక్‌ను కవిత మిస్ అవుతున్నారన్న. గతంలో లాగా ఆంధ్రా వర్సెస్ తెలంగాణ అనే అరిగిపోయిన ప్రాంతీయ సెంటిమెంట్ ఆయుధం ఇప్పుడు తెలంగాణ సమాజంలో పెద్దగా పనిచేయడం లేదు. ముఖ్యంగా జెన్-జీ, యువత అభివృద్ధి, ఉపాధిని కోరుకుంటున్నారు తప్ప ఇలాంటి కృత్రిమ వివాదాలను పట్టించుకోవడం లేదు. తెలంగాణలో ప్రస్తుతం ఉనికిలోనే లేని, క్షేత్రస్థాయిలో తమకు శత్రువే కాని పవన్ కల్యాణ్‌ను ఒక పెద్ద విలన్‌గా చిత్రీకరించి, ఆయనపై కవిత చేస్తున్న ఈ శైలి పోరాటం చాలా మందికి అపరిపక్వంగా, తెలివితక్కువతనంగా కనిపిస్తోంది. లేని శత్రువును సృష్టించుకుని యుద్ధం చేయడం వల్ల సమయం, శ్రమ వృథా అవ్వడమే తప్ప ఎలాంటి లాభం ఉండదు. ప్రశాంత్ కిషోర్ లాంటి వ్యూహకర్త ఖచ్చితంగా ఇలాంటి బలహీనమైన, కాలం చెల్లిన వ్యూహాలను కవితకు రికమండ్ చేసి ఉండరనేది స్పష్టమైన వాస్తవం. పీకే ఇచ్చిన గైడెన్స్‌ను పక్కనబెట్టి, సొంత ఆలోచనలతో పవన్ కల్యాణ్‌పై అనవసర యుద్ధానికి దిగడం కవితకు సెల్ఫ్ గోల్ లాగా మారుతోంది. ఇకనైనా ఈ లేని శత్రువుల చుట్టూ తిరిగే రాజకీయాన్ని పక్కనబెట్టి.. తెలంగాణ క్షేత్రస్థాయి ప్రజా సమస్యలపై, ఇక్కడి అధికార కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై నిర్మాణాత్మకంగా పోరాడితేనే కవితకు పొలిటికల్ మైలేజ్ దక్కుతుంది. లేకపోతే జనసేన పార్టీ వర్సెస్ టీఆర్ఎస్ అన్నట్లుగా ఉనికి లేని రాజకీయం చేసుకోవాల్సి వస్తుంది.

# ఒలింపిక్ స్ఫూర్తిని ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలి: మంత్రి వాకిటి శ్రీహరి

పలు కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసిందని మంత్రి తెలిపారు. 2036 ఒలింపిక్స్‌లో తెలంగాణ క్రీడాకారులు పతకాలు సాధించే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు సీఎం కప్ రెండు ఎడిషన్లను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. క్రీడల అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ఒలింపిక్ డే అందించే క్రీడా స్ఫూర్తిని మరింత విస్తృతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు.

## భారతదేశ అసలు సిసలైన హీరో శ్యామాప్రసాద్ ముఖర్జీ: కేంద్ర మంత్రి బండి సంజయ్



హైదరాబాద్ : కేంద్రమంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ దేశం కోసం యుద్ధం చేయడానికి జన సంఘ్ కార్యకర్తలకు తుపాకీలిచ్చి పాకిస్తాన్ పై యుద్ధం చేయడానికి పంపిన వీరుడు పార్టీ, రాజకీయాల కంటే దేశమే ఫస్ట్ అని చాటి చెప్పిన గొప్ప నేత. దేశం కోసం ఆత్మ బలిదానం చేసుకున్న ఏకైక జాతీయ పార్టీ అధ్యక్షుడు శ్యామాప్రసాద్ ఆశయాలను అమలు చేస్తున్న మోదీ ప్రభుత్వం. 370 ఆర్టికల్ రద్దు,మేక్ ఇన్ ఇండియా,స్టార్టప్ ఇండియా ముఖర్జీ ఆకాంక్షలే దళారీ వ్యవస్థ లేకుండా లబ్దిదారులకు సంక్షేమ ఫలాలు అందిస్తున్నాం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్. శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా ఘన నివాళి అర్పించిన కేంద్ర మంత్రి..భారతదేశ అసలు సిసలైన హీరో శ్యామాప్రసాద్ ముఖర్జీ అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అభివర్ణించారు.దేశం కోసం యుద్ధం చేయడానికి సిద్దంగా ఉండాలని జన సంఘ్ కార్యకర్తలను పిలుపునివ్వడమే కాకుండా కార్యకర్తలకు తుపాకీలిచ్చి పాకిస్తాన్ పై యుద్ధం చేయడానికి పంపిన వీరుడని కొనియాడారు. పార్టీ, వ్యక్తులు, రాజకీయాల కంటే దేశమే ఫస్ట్ అని చాటి చెప్పిన గొప్ప నేత శ్యామాప్రసాద్ ముఖర్జీ అని, దేశం కోసం ఆత్మ బలిదానం చేసుకున్న ఏకైక జాతీయ పార్టీ అధ్యక్షులు,పార్లమెంట్ లో ఏకైక ప్రతిపక్ష నేత కూడా ఆయనేనని తెలిపారు. శ్యామాప్రసాద్ ముఖర్జీ ఆలోచనలను,ఆశయాలను, ఆకాంక్షలను బీజేపీ తూ.చ తప్పకుండా అమలు చేస్తోందని తెలిపారు.ముఖర్జీ ఆకాంక్షలకు అనుగుణంగా వాజ్ పేయి ప్రభుత్వం అణ్వాయుధాలను సమకూరిస్తే..370 ఆర్టికల్ ను రద్దు చేసి శ్యామా ప్రసాద్ ముఖర్జీ కలను నరేంద్రమోదీ నెరవేర్చారని మహనీయుడి ఆశయాలు, ఆకాంక్షలను అమలు చేయడమే ఆయనకు అందిస్తున్న ఘనమైన నివాళి

# ఘనంగా సుప్రజా బిల్డర్స్ అండ్ పరంపర స్వీట్స్ అధినేత తూడి ప్రవీణ్ జన్మదిన వేడుకలు





హైదరాబాద్ / శేర్లింగంపల్లి (వాయిస్ టుడే) : హైదరాబాద్ కొకపేట మున్నూరు కాపు ట్రస్ట్ కోశాధికారి, సుప్రజా బిల్డర్స్ అండ్ పరంపర స్వీట్స్ అధినేత తూడి ప్రవీణ్ జన్మదిన వేడుకలు చందానగర్ క్రిస్టల్ గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో పలువురు ప్రముఖులు, సంఘ నాయకులు, వ్యాపార వర్గ ప్రముఖులు పాల్గొని తూడి ప్రవీణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వాయిస్ టుడే ఎండీ కొత్త లక్ష్మణ్ పటేల్, ఆకుల రజిత్, మున్నూరు కాపు రాష్ట్ర ఉపాధ్యక్షులు వాసల వెంకటేష్,గ్రేటర్ మున్నూరు కాపు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ పెరుక రమేష్ పటేల్, బీసీ సంఘ రాష్ట్ర నాయకులు అరె దశరథం, అరె మహేందర్, హాఫిజ్‌పేట్ మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు మహేందర్ మరియు కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. వారు తూడి ప్రవీణ్ సేవా కార్యక్రమాలు, వ్యాపార రంగంలో సాధించిన అభివృద్ధిని అభినందిస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. సమాజ సేవలో ఆయన మరింతగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. వేడుకల సందర్భంగా అభిమానులు ప్రవీణ్‌ను గజమాలతో సత్కరించారు. డప్పు వాయిద్యాల నడుమ సాంస్కృతిక వాతావరణం నెలకొంది. ఆహ్లాదకరమైన వాతావరణంలో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర నాయకులు, నియోజకవర్గ అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై తూడి ప్రవీణ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



## రోస్టర్ పాయింట్లు సవరించే వరకు ఉద్యోగ నోటిపికేషన్లు ఆపండి

### తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ ను కలిసి విజ్ఞప్తి చేసిన మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోపోజు రమేష్ బాబు



హైదరాబాద్, జూన్ 23: ఎస్సీ వర్గీకరణ, రోస్టర్ పాయింట్లతో నష్టపోతున్న మాల, 26 ఎస్సీ కులాలకు న్యాయం జరగాలంటే రోస్టర్ పాయింట్స్ మార్చాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోపోజు రమేష్ బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ ను మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోపోజు రమేష్ బాబు కలిసి రోస్టర్ పాయింట్లతో మాలలకు, మాల ఉపకులాలకు జరుగుతున్న అన్యాయాన్ని వివరిస్తూ వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రోస్టర్ పాయింట్లు సవరించే వరకు ఉద్యోగ నోటిఫికేషన్లు ఆపాలని ఆయన మీనాక్షి నటరాజన్ను కోరారు. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఉద్యోగ నోటిఫికేషన్లలో మాలలతో పాటు 26 ఎస్సీ కులాలకు ఒక్క ఉద్యోగం కూడా రాలేదన్నారు. మాలలకు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా 5శాతం రిజర్వేషన్ కేటాయించినప్పటికీ ఒక్క శాతం కూడా అమలు కావడం లేదని అన్నారు. రోస్టర్ పాయింట్లు మార్పు చేసి, ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని సవరించి మాలలతో పాటు 26 ఎస్సీ కులాలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయాలని ఆయన కోరారు.



## మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది: సునీత రెడ్డి

హైదరాబాద్, జూన్ 23: ( వాయిస్ టూ డే): మహిళల సంక్షేమం, ఆర్థిక సాధికారత కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని డీసీసీ వైస్ ప్రెసిడెంట్ సునీత రెడ్డి అన్నారు. బాగ్ అంబర్‌పేట్ డివిజన్‌లోని మల్లికార్జున నగర్‌లో మహిళా సంఘాలకు 'ఇందిరా మహిళా శక్తి' కార్యక్రమం కింద చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సునీత రెడ్డి మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేస్తూ మహిళలకు ఉపాధి అవకాశాలను విస్తృతం చేస్తున్నామని తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు చెందిన మహిళలు స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగేందుకు అవసరమైన శిక్షణ, ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి మహిళ సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. మహిళల అభివృద్ధి ద్వారానే రాష్ట్ర సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో లావణ్య, పద్మ, తంగవేలు తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణలో ఎస్ఐఆర్ (SIR) భారతీయ జనతా పార్టీ పర్యటన

### విజయవంతం చేయాలి అని పిలుపునిచ్చిన మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఉపాధ్యక్షులు మల్లెల నర్సింగ్ రావు

నాచారం (వాయిస్ టుడే):పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంతో పాటు రాబోయే GHMC ఎన్నికలు మరియు 2028 లో అధికారమే లక్ష్యంగా దిశానిర్దేశం చేయడం, కార్యకర్తల సమన్వయం తదితర అంశాలపై సమావేశంలో చర్చ జరగనుంది. అలాగే ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం గత 12 సంవత్సరాలుగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాలు మరియు దేశ అభివృద్ధి కోసం అమలు చేస్తున్న పలు కార్యక్రమాలపై కూడా చర్చించడం జరుగుతుంది. ఈ సమావేశం పార్టీ శ్రేణులకు నూతన ఉత్సాహాన్ని అందించడంతో పాటు, భవిష్యత్ కార్యాచరణకు మార్గదర్శకంగా నిలవనుందని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఉపాధ్యక్షులు మల్లెల నర్సింగ్ రావు ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో తెలియజేశారు. ఈ పత్రిక సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్, బండారు వెంకట్రావు, దేవసాని బాలచందర్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ అభివృద్ధికి కిషన్ రెడ్డి కృషి అభినందనీయం: రాజు నేత



సికింద్రాబాద్, జూన్ 23 (వాయిస్ టుడే ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రస్తుతం కూడా రాష్ట్ర అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేస్తున్నారని బీజేపీ సీనియర్ నాయకులు ఎనుగంటి రాజు నేత అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో పోరు యాత్రలు, నిరాహార దీక్షల ద్వారా రాష్ట్ర ఆకాంక్షలను జాతీయ స్థాయిలో వినిపించిన కిషన్ రెడ్డి, ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వంలో తెలంగాణకు ప్రాతినిధ్యం వహిస్తూ రైల్వేలు, జాతీయ రహదారులు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఇటీవల ఢిల్లీలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రుల మధ్య జరిగిన సమావేశాలకు సమన్వయకర్తగా వ్యవహరించి రాష్ట్ర ప్రయోజనాల కోసం సహకార వాతావరణం కల్పించడం అభినందనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను తెలంగాణలో సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు మరింత ప్రయోజనం చేకూరేలా చూడాలని రాజు నేత కోరారు.

## డాక్టర్ శ్యామప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు



సికింద్రాబాద్, జూన్ 23 (వాయిస్ టుడే ప్రతినిధి): భారత జనసంఘ్ వ్యవస్థాపకులు, మహోన్నత దేశభక్తుడు డాక్టర్ శ్యామప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా మధురనగర్ కాలనీలో కంటెస్టెడ్ కార్పొరేటర్ మేకల కీర్తి హర్ష కిరణ్ డివిజన్ నాయకులతో కలిసి డాక్టర్ శ్యామప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేకల కీర్తి హర్ష కిరణ్ మాట్లాడుతూ, "ఒకే దేశంలో ఇద్దరు ప్రధానులు, రెండు రాజ్యాంగాలు, రెండు జెండాలు ఉండకూడదని దేశ సమైక్యత కోసం గళమెత్తిన మహానేత డాక్టర్ శ్యామప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు. ఆయన కలలుగన్న అఖండ భారత లక్ష్యాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో ఆర్టికల్ 370 రద్దుతో సాకారం చేశారన్నారు. కాశ్మీర్‌ను భారతదేశంలో సంపూర్ణ భాగంగా మార్చి ముఖర్జీ ఆశయాలను నిజం చేశారు" అని పేర్కొన్నారు. దేశ సమైక్యత కోసం శ్యామప్రసాద్ ముఖర్జీ చేసిన సేవలను ఈ సందర్భంగా నాయకులు స్మరించుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సాయిదత్తు, హనుమంతు ముదిరాజు, సతీష్ నేత, మూల అరవింద్, గుండ్రపల్లి శ్రీనివాస్, సత్యనారాయణ, సాయి ముదిరాజ్, యాదమ్మ, మమత, భిక్షపతి, నాగరాజు తదితరులు మరియు స్థానిక కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ స్మారక కవితా పురస్కారం - 2026కు డా. పెరుక రాజు ఎంపిక



విశ్వ సాహితీ కళావేదిక అధ్యక్షురాలు కె. రమావతి మరియు కార్యవర్గ సభ్యులు ప్రకటించిన ప్రకారం, "ఎన్టీఆర్ స్మారక కవితా పురస్కారం--2026"కు డా. పెరుక రాజును ఎంపిక చేశారు. డా. పెరుక రాజు కవిగా, బహుభాషా వేత్తగా దేశవ్యాప్తంగా మాత్రమే కాక విదేశాలలోనూ సాహిత్యాభిమానులను సంపాదించుకున్నారు. ప్రస్తుతం ఆయన దేశ రక్షణ శాఖ ఆర్మీ విభాగంలో జూనియర్ అధికారిగా విధులు నిర్వహిస్తూ, ఉద్యోగ బాధ్యతలతో పాటు సాహిత్య సేవలను కూడా నిరంతరం కొనసాగిస్తున్నారు. అలాగే "మై గిఫ్ట్ యువ సంస్థ" రూపశిల్పిగా సామాజిక సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటూ యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ఈ సందర్భంగా నెల్లూరు నగరంలో అంగరంగ వైభవంగా నిర్వహించనున్న పలు సంస్థల ప్రత్యేక సాహిత్య--సాంస్కృతిక కార్యక్రమంలో డా. పెరుక రాజును శాలువా, సన్మాన పత్రం, జ్ఞాపిక, ఎన్టీఆర్ స్మారక కవితా పురస్కారం తో పాటు నగదు బహుమతితో సత్కరించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం డా. పెరుక రాజుకు లభించిన సందర్భంగా సాహితీవేత్తలు, కవులు, కళాకారులు, సామాజికవేత్తలు, సాహిత్యాభిమానులు మరియు మిలిటరీ మిత్రులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశారు.

## జనసేన పార్టీ తెలంగాణ జాయినింగ్స్ కమిటీ సభ్యుడిగా గడల శ్రీనివాస్ రావు నియామకం



హైదరాబాద్ (వాయిస్ టుడే) : జనసేన పార్టీ తెలంగాణ జాయినింగ్స్ కమిటీలో సభ్యునిగా బాధ్యతలు అప్పగించడం నాకు గౌరవప్రదంగా, హృదయాన్ని తాకే బాధ్యతగా భావిస్తున్నానని గడల శ్రీనివాస్ రావు తెలిపారు. తనపై విశ్వాసం ఉంచి ఈ అవకాశాన్ని కల్పించిన జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ కు , అలాగే పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి కు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఇది కేవలం ఒక పదవి మాత్రమే కాదని, జనసేన సిద్ధాంతాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లేందుకు, తెలంగాణ ప్రజలకు నిబద్ధతతో సేవ చేయడానికి లభించిన గొప్ప అవకాశమని ఆయన పేర్కొన్నారు.



## టీఎన్జీవో ఐపిఎం శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక

హైదరాబాద్, జూన్ 23: టీఎన్జీవో ఐపిఎం శాఖ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. నారాయణగూడ లోని టీఎన్జీవోస్ ఐపిఎం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎన్నికల అధికారి ఎం.నాగిరెడ్డి ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షులుగా ఎం.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా ఎస్. ప్రశాంత్ కుమార్, కార్యదర్శిగా పి.ప్రదీప్ కుమార్, సంయుక్త కార్యదర్శిగా ఎల్.భారతి, కోశాధికారిగా పి.శ్రీరామ్, కార్యనిర్వహక కార్యదర్శిగా కె. శ్రీనివాస్, ప్రచార కార్యదర్శిగా బి. రమేష్బాబు, కార్యవర్గ సభ్యులుగా జాహంగీర్ ఆలీ, ఎన్.సత్యనారాయణ రెడ్డి, కె.పద్మలు ఎన్నికయ్యారు. ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ అసోసియేట్ అధ్యక్షుడు ఎం. సత్యనారాయణ గౌడ్, నగర అధ్యక్షుడు శ్రీకాంత్, యూనియన్ నేతలు లక్ష్మణ్, ఖాదర్ తదితరులు సన్మానించి అభినందనలు తెలియజేశారు.



## బీజేపీ ఎండోమెంట్ సెల్ సెంట్రల్ జిల్లా కన్వీనర్ రామన్న గారి పోచాలు ప్రసాద్ నియామకం

హైదరాబాద్, జూన్ 23: బీజేపీ ఎండోమెంట్ సెల్ (ధార్మిక విభాగం) హైదరాబాద్ సెంట్రల్ జిల్లా కన్వీనర్ రామన్నగారి పోచాలు ప్రసాద్ను నియమిస్తూ రాష్ట్ర కన్వీనర్ అన్నవోజుల సూర్యప్రకాష్, రాష్ట్ర కో -కన్వీనర్ నిరంజన్ దేశాయ్ మంగళవారం అధికారిక ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా బర్కతపురలోని పార్టీ నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రామన్నగారి పోచాలు ప్రసాద్ ను పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి డాక్టర్ ఎన్.గౌతంరావు, జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి, తదితరులు ఘనంగా సత్కరించి అభినందించారు. అనంతరం పోచాలు ప్రసాద్ మాట్లాడుతూ... పార్టీ తనపై ఉంచిన విశ్వాసానికి కృతజ్ఞతలు తెలియజేశారు. తనకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో, సమర్థవంతంగా నిర్వహిస్తూ ధార్మిక రంగ అభివృద్ధి, ఆలయాల పరిరక్షణ, హిందూ ధార్మిక విలువల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు. అలాగే బీజేపీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. పార్టీ నేతలు తనకు అందించిన ప్రోత్సాహం, సహకారానికి పోచాలు ప్రసాద్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.



## రామ్‌రెడ్డి నగర్ శ్రీ వినాయక దేవాలయ వాచకోత్సవంలో పాల్గొన్నా మేడ్చల్ జిల్లా ఫిషరీస్ చైర్మన్ మన్నె రాజు

కుత్బుల్లాపూర్ జూన్ 23(వాయిస్ టుడే ): సుభాష్ నగర్ డివిజన్ రామ్‌రెడ్డి నగర్ శ్రీ వినాయక దేవాలయంలో నిర్వహించిన వాచకోత్సవం కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఫిషరీస్ చైర్మన్ మన్నె రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు. అనంతరం భక్తులకు అన్నదానం వడ్డించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాస్కర్ రెడ్డి టిటికె శ్రీను బాలరాజు గుప్తా వామన్ గుప్తా మరియు ఆలయ కమిటీకి చెందిన ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడింది.



## ఓయూ పరిధిలోని బస్తీల సమస్యలపై వీసీతో మాజీ డిప్యూటీ మేయర్ సమీక్ష

సికింద్రాబాద్, జూన్ 23 (వాయిస్ టుడే ప్రతినిధి): ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని 9 బస్తీల ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సదుపాయాల సమస్యలపై ఉస్మానియా యూనివర్సిటీ విసి తో గ్రేటర్ హైదరాబాద్ మాజీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి విస్తృత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బస్తీలలోని దేవాలయాలు, మసీదులకు తాగునీటి సరఫరా, విద్యుత్ అంతరాయాలు, రహదారుల దుస్థితి, డ్రైనేజీ సమస్యలు, వీధి దీపాల ఏర్పాటు, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలను మాజీ డిప్యూటీ మేయర్ వీసీ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సమస్యల కారణంగా స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించి, తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. వైస్ ఛాన్సలర్ సమస్యలపై సానుకూలంగా స్పందిస్తూ సంబంధిత విశ్వవిద్యాలయ అధికారులు, ఇంజినీరింగ్, పరిపాలనా విభాగాలకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేందుకు విశ్వవిద్యాలయం తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మోతే శ్రీలత శోభన్ రెడ్డి మాట్లాడుతూ, ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో నివసిస్తున్న ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా సంబంధిత శాఖలతో సమన్వయం చేస్తూ సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి వేగవంతమవుతుందని ఆమె పేర్కొన్నారు.



## మేడిపల్లి నూతన ఇన్స్పెక్టర్ జలెందర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసిన గొరిగే నర్సింహా

సికింద్రాబాద్/మేడిపల్లి, జూన్ 23 (వాయిస్ టుడే ప్రతినిధి): మేడిపల్లి పోలీస్టేషన్ లో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఇన్స్పెక్టర్ జలెందర్ రెడ్డి. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ ను తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకులు గొరిగే నర్సింహా కురుమ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మేడిపల్లి పోలీస్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం విశిష్ట సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చెంగిచెర్ల డివిజన్ టీఆర్ఎస్ నాయకులు మేడ బాపురాజు, ఎం.డి. యాకూబ్ పాషా, దామెర కుమార్,నరేష్, శ్రీనివాస్ కుండే సతీష్, చిందం కమల్ కిరణ్, మంగ వినయ్ పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

సికింద్రాబాద్, జూన్ 23 (వాయిస్ టుడే ప్రతినిధి): అనారోగ్యంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన లాలాగూడ పోలీస్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... లాలాపేటలోని అంబేద్కర్ విగ్రహం సమీపంలోని ఫుట్పాత్పై మంగళవారం ఉదయం 8 గంటల సమయంలో సుమారు 40–45 సంవత్సరాల మధ్య వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సదరు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు.




## ప్రతి డివిజన్‌లో ఫిష్ మార్కెట్ ఏర్పాటు చేయాలి

### పొలిటికల్ ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ బైరు శేఖర్

సికింద్రాబాద్, జూన్ 23 (వాయిస్ టుడే ప్రతినిధి): గ్రేటర్ హైదరాబాద్ లోని ప్రతి డివిజన్ పరిధిలో ఒక్కొక్క ఫిష్ మార్కెట్ ఏర్పాటు చేయాలని పొలిటికల్ ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ బైరు శేఖర్ డిమాండ్ చేశారు. ఈమేరకు హైదరాబాద్,సుందరయ్య విజ్ఞానకేంద్రంలో మంగళవారం గంగపుత్ర రాజకీయ చైతన్యం, విద్య ,ఉద్యోగ,వృత్తి హక్కుల రక్షణకై బీసీ పొలిటికల్ ఫ్రంట్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బిఆర్ఎస్ పార్టీ యువనేత ముఠా జై సింహ, ప్రొఫెసర్ సుదర్శన్ రావు, మెట్టు ధనరాజ్, శ్రీహరి , శంకర్ పలువురు హాజరై మాట్లాడారు.

ఈ సందర్భంగా పొలిటికల్ ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ బైరు శేఖర్ మాట్లాడుతూ గంగపుత్రులు శతాబ్దాలుగా చేపల వేట, చేపల పెంపకం, జలవనులసంరక్షణను తమ జీవనాధారంగా కొనసాగిస్తున్న సమాజం, దేశ ఆహార భద్రతలో, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో, మత్స్య సంపద అభివృద్ధిలో గంగపుత్రుల పాత్ర ఎంతో గొప్పదన్నారు. అయినప్పటికీ విద్య ఉద్యోగాలు రాజకీయ ప్రాతినిధ్యం వృత్తి అభివృద్ధి వంటి రంగాల్లో ఇంకా అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారన్నారు. ఈ నేపథ్యంలో గంగపుత్ర రాజకీయ చైతన్యం సామాజిక ఐక్యత ఆర్థిక స్వావలంబన అత్యంత అవసరం అన్నారు. ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి మరింత ప్రాధాన్యతనిస్తూ, ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయాలన్నారు. అదేవిధంగా విద్య ఐక్యత రాజకీయ చైతన్యం ఆర్థిక అనే నాలుగు సూత్రాలతో గంగపుత్రుల సమాజాన్ని అభివృద్ధిపథంలోనడిపించాలని కోరారు.

# గురివింద గింజకూ తన నలుపు తెలియదు... కాంగ్రెస్ నాయకులకు కుత్బుల్లాపూర్ అభివృద్ధి కనిపించదు

## కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ నాయకుల తీవ్ర విమర్శలు



కుత్బుల్లాపూర్ జూన్ 23(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత, హ్యాట్రిక్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ గారిపై కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హనుమంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ చేసిన అసందర్భ వ్యాఖ్యలను ఖండిస్తూ చింతల్ లోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, ఇతర నాయకులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... కెమెరాలు, మైకులు కనిపిస్తే చాలు వాస్తవాలు తెలియకపోయినా ఏదో ఒకటి మాట్లాడటం కాంగ్రెస్ నాయకులకు అలవాటుగా మారిందని కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. ప్రజల చేత పలుమార్లు తిరస్కరించబడిన నాయకులు నేడు నియోజకవర్గ అభివృద్ధిపై మాట్లాడటం హాస్యాస్పదమని విమర్శించారు. కార్పొరేటర్ స్థాయి గురించి మాట్లాడే మీరు, 2020 ఎన్నికల్లో మీ సొంత కుటుంబ సభ్యుడినే గెలిపించుకోలేకపోయారు. కుత్బుల్లాపూర్ ప్రజలు మిమ్మల్ని వరుసగా మూడుసార్లు తిరస్కరించినా ఇంకా వాస్తవాలు గ్రహించకపోవడం విచారకరం. వ్యక్తిగత వ్యాపార, కుటుంబ ప్రయోజనాల కోసం కాంగ్రెస్, వైఎస్సార్ కాంగ్రెస్, బీజేపీ అంటూ పార్టీలు మారిన మీరు, నేడు రాజకీయ నీతుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉంది. మీరు పార్టీలు మార్చింది ప్రజాసేవ కోసం కాదు, స్వప్రయోజనాల కోసమేనని ప్రజలకు బాగా తెలుసు. మా నాయకుడు పార్టీ మారిన విషయాన్ని ప్రశ్నించే ముందు, మీరు ఎన్ని పార్టీలు మారారో ప్రజలకు గుర్తు చేసుకోండి. ప్రజా సంక్షేమం, ప్రజా అభివృద్ధి కోసం తీసుకున్న రాజకీయ నిర్ణయాలను స్వప్రయోజనాల కోసం పార్టీలు మారడితో పోల్చడం సరైంది కాదు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన వందలాది హామీలలో కనీసం 10 శాతం అయినా అమలు చేశారా? అధికార పార్టీలో ఉంటూ కుత్బుల్లాపూర్ అభివృద్ధికి మీరు చేసిన కృషి ఏమిటో చెప్పలేక, అధిష్టానం మెప్పుకోసం ప్రెస్మీట్లు పెట్టడం మానుకోవాలి. మీకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే నియోజకవర్గానికి నిధులు తీసుకురావాలి. అభివృద్ధికి నిధులు తీసుకురావడం చేతకాకపోయినా, ప్రసంగాల్లో మాత్రం పెద్దపెద్ద మాటలు మాట్లాడటం కాంగ్రెస్ నాయకుల ప్రత్యేకతగా మారింది. కుత్బుల్లాపూర్ ప్రజల సమస్యలపై స్పందించకుండా, కెమెరాలు కనిపించినప్పుడే బయటకు రావడం ప్రజలు గమనిస్తున్నారు. గతంలో ఎన్నికల్లో ప్రజల విశ్వాసాన్ని పొందలేక ఘోర పరాజయాలు ఎదుర్కొన్న నాయకులు, నేడు అధికార అహంకారంతో పగటి కలలు కనడం మినహా ప్రజలకు చేసిందేమీ లేదు. అధికార అండతో పైరవీలు, సెటిల్మెంట్లు చేయడం తప్ప నియోజకవర్గ అభివృద్ధికి ఒక్క రూపాయి విలువైన పని చేసిన దాఖలాలు లేవు.

కేసీఆర్ నాయకత్వంలో, కేటీఆర్ మార్గదర్శకత్వంలో, ఎమ్మెల్యే కె.పీ. వివేకానంద్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి వేల కోట్ల రూపాయల నిధులు తీసుకువచ్చి గత ఆరు దశాబ్దాల్లో జరగని అభివృద్ధిని పదేళ్లలో సాధించారు. అందుకే ప్రజలు ఆయనను వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించి, గత ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో ఆశీర్వదించారు. 2014, 2018, 2023 ఎన్నికల్లో కుత్బుల్లాపూర్ ప్రజలు కాంగ్రెస్ నాయకులను చిత్తుగా ఓడించారు. డిపాజిట్లు కూడా రాలేదు. రైతులు సంతోషంగా ఉన్నారని చెప్పే కాంగ్రెస్ నాయకులు ఒకసారి రైతుల వద్దకు వెళ్లి వారి పరిస్థితి తెలుసుకోవాలి. పంటకు గిట్టుబాటు ధర లేక, ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడుతున్న అవస్థలు కనిపించడంలేదా? యూరియా కోసం రైతులు రోజుల తరబడి క్యూలలో నిలబడిన పరిస్థితి కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు నిదర్శనం. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు ఇంటి వద్దకే ఎరువులు చేరేలా వ్యవస్థను ఏర్పాటు చేసింది.

### కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు కాకపోవడంతో ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజాభవన్, సచివాలయాల చుట్టూ తిరుగుతూ తమ హక్కుల కోసం వేడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతుంటే, అధికారంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు మాత్రం ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ముఖ్యమంత్రిని ప్రశ్నించే ధైర్యం చేయడం లేదు. హైడ్రా, మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇళ్లను కూల్చివేస్తూ ప్రజల జీవితాలను సంక్షోభంలోకి నెట్టడం అభివృద్ధి కాదని ప్రజలు చెబుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్న అభివృద్ధి, వృద్ధాప్య పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న వృద్ధుల కన్నీళ్లలో కనిపిస్తోంది. పంట అమ్ముడుపోక నష్టపోతున్న రైతుల బాధల్లో కనిపిస్తోంది. సంక్షేమ పథకాల కోసం ప్రజలు పడుతున్న ఇబ్బందుల్లో కనిపిస్తోంది. 2022 జనవరి 25న అప్పటి మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా శంకుస్థాపన చేసిన ఫ్లైఓవర్ను పూర్తి చేసిన తరువాత కూడా ప్రజలకు తగిన గౌరవం ఇవ్వకుండా హడావుడిగా ప్రారంభించడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని సూచిస్తోంది.

### రేవంత్ రెడ్డి ఇచ్చిన 420 హామీల్లో 10 శాతం కూడా పూర్తి చేయలేదు.

కుత్బుల్లాపూర్ లో వేలకోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి చేసిన ఎమ్మెల్యేను అనడం మానేసి, సీఎం రేవంత్ రెడ్డి తో తులం బంగారం, 4000 పెన్షన్ వంటి సంక్షేమ పథకాల విషయంలో సీఎం రేవంత్ రెడ్డితో కొట్లాడి తీసుకొస్తే బాగుంటుంది. 2014లో తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 2015లో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతుల మీదుగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో దాదాపు 400 కోట్ల రూపాయలతో రిజర్వాయర్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసుకుని రెండేళ్లలోనే వాటిని పూర్తి చేసి ప్రజలకు ఏనాడు నీటి కష్టాలు తెలియకుండా చూసుకున్న నాయకులు పార్టీ మా బిఆర్ఎస్ పార్టీ, మా ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ తన సొంత నిధులతో ఒకేషనల్ జూనియర్ కాలేజీని కట్టించిన ఘనత మా ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ దక్కుతుంది.

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మంచి నీటికై ప్రజలు పడ్డ అవస్థలు మనం నిత్యం చూస్తూనే ఉన్నాం. ఇదేనా మీ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి...? హెచ్ఎండబ్ల్యూఎస్ ఫెయిల్యూర్, సేవరేజ్ బోర్డు ఫెయిల్యూర్. జిహెచ్ఎంసి నీ మూడు ముక్కలు చేసినారు. వారానికి ఒక అధికారిని మారుస్తున్నారు. వాళ్ల పరిస్థితి పై అవగాహన వచ్చే లోపే అధికారులు, బదిలీ అవుతున్నారు. మీకు పరిపాలన చేతగాక చేసే పనులతో జనాలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం చేస్తున్న అవినీతి, అక్రమాలు కనిపించకపోతే, బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన "కంటి వెలుగు" కార్యక్రమాన్ని మళ్లీ ప్రారంభించి తమ దృష్టిని మెరుగుపరుచుకోవాలని కాంగ్రెస్ నాయకులకు సూచిస్తున్నాం. ఎన్ని మేకపోతు గాంభీర్యాలు ప్రదర్శించినా, తెలంగాణ ప్రజల గుండెల్లో బీఆర్ఎస్కు ఉన్న స్థానం చెరగదు. 2028లో మళ్లీ తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడి, కుత్బుల్లాపూర్లో గులాబీ జెండా మరింత ఎత్తుగా ఎగురుతుంది. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, సురేష్ రెడ్డి, రషీదా మహమ్మద్ రఫీ, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, పుప్పాల భాస్కర్, పోలే శ్రీకాంత్, దేవరకొండ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, వివిధ డివిజన్లకు చెందిన సీనియర్ నాయకులు కమలాకర్, జల్ద లక్ష్మీ నాథ్, ఓంకార్ రెడ్డి, క్రాంతి యాదవ్, మక్సుద్ అలీ, ఆకుల ప్రభాకర్, బసవరాజ్, సిద్దిక్, శ్రీనివాస్ రెడ్డి, వారాల వినోద్, గుబ్బల, రాకేష్ జలిగం, సంపత్ గౌడ్, ఆటో బలరాం తదితరులు పాల్గొన్నారు.

# వికసిత్ భారత్ లక్ష్య సాధనలో యువత కీలక పాత్ర పోషించాలి

### బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు

### యువత ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలి

### ఎంపీ ఈటెల రాజేందర్

### ఘనంగా బీజేవైఎం "నమో జెన్ జెడ్ కాన్క్లేవ్"




సికింద్రాబాద్, జూన్ 23 (వాయిస్ టుడే ప్రతినిధి): వికసిత్ భారత్--2047 లక్ష్య సాధనలో యువత కీలక పాత్ర పోషించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్, బాగ్ లింగంపల్లిలోని ఆర్టీసీ కళాభవన్ లో భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ కుండే నేతృత్వంలో "నమో జెన్ జెడ్ కాన్క్లేవ్" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు, శాసనసభాపక్ష నాయకుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎంపీ ఈటెల రాజేందర్, ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి లు పాల్గొని యువతను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎన్. రాంచందర్ రావు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం గత 12 సంవత్సరాల్లో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ యువతలో అపారమైన ప్రతిభ ఉందని, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. నూతన విద్యా విధానం, స్కిల్ ఇండియా వంటి కార్యక్రమాలు యువత భవిష్యత్తుకు బలమైన పునాదులు వేస్తున్నాయని పేర్కొన్నారు.



ఎంపీ ఈటెల రాజేందర్ మాట్లాడుతూ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని అన్నారు. స్టార్టప్ ఇండియా, స్టాండ్ అప్ ఇండియా, ముద్ర యోజన వంటి పథకాల ద్వారా అనేక మంది యువత పారిశ్రామికవేత్తలుగా ఎదుగుతున్నారని తెలిపారు. పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ డిజిటల్ ఇండియా ద్వారా గ్రామీణ యువతకు కూడా విస్తృత అవకాశాలు అందుబాటులోకి వచ్చాయని, సాంకేతికతను వినియోగించుకుని స్వయం సమృద్ధి సాధించాలని సూచించారు. అంజిరెడ్డి మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో యువత భాగస్వామ్యం మరింత పెరగాల్సిన అవసరం ఉందని, సామాజిక సేవా భావన, నాయకత్వ లక్షణాలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ కుండే మాట్లాడుతూ "నమో జెన్ జెడ్ కాన్క్లేవ్" లక్ష్యం కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలపై యువతకు అవగాహన కల్పించడమేనన్నారు. యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించి దేశాభివృద్ధిలో భాగస్వాములను చేయడమే కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు జి. హరీశ్వర్ రెడ్డి, మల్కా యశస్వి, ఉపాధ్యక్షులు ప్రవీణ్ రెడ్డి, సందీప్ గౌడ్, నితిన్ నందకర్, అనితా రెడ్డి, శరత్ చంద్ర, సాయినాథ్, రాష్ట్ర కార్యదర్శులు శివచంద్రగిరి, వరప్రసాద్ రెడ్డి, అరవింద్ రెడ్డి, హరిప్రసాద్, ప్రదీప్ రావు, ఝాన్సీ, కోశాధికారి నరేన్ దేశ్‌పాండేతో పాటు పలువురు రాష్ట్ర పదాధికారులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అందుబాటులో లాప్రోస్కోపిక్ ఆపరేషన్లు

## --నిర్మల ఆసుపత్రితో కూరపాటి లాప్రోస్కోపిక్ సెంటర్ ఎంఓయూ

## --తొర్రూరు కేంద్రంగా అందుబాటు ధరల్లో లాప్రోస్కోపిక్ ఆపరేషన్లు



తొర్రూరు జూన్ 23 (వాయిస్ టుడే) : రోగులకు ప్రయోజనం చేకూర్చే మినిమల్లీ ఇన్వేసివ్ విధానాన్ని కలిగి ఉన్న లాప్రోస్కోపిక్ ఆపరేషన్లను గ్రామీణ ప్రాంతాలకు విస్తరిస్తున్నట్లు కూరపాటి అడ్వాన్స్ లాప్రోస్కోపిక్ సెంటర్ నిర్వాహకులు డాక్టర్ కూరపాటి రమేష్, నిర్మల ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ రంజిత్ కుమార్ లు తెలిపారు.అధునాతన ఆపరేషన్లు నిర్వహించేందుకు తొర్రూర్ లోని నిర్మల ఆసుపత్రితో హనుమకొండ కూరపాటి అడ్వాన్స్ లాప్రోస్కోపిక్ సెంటర్ ఎంవోయూ కుదుర్చుకుంది.ఈ మేరకు మంగళవారం పట్టణంలోని నిర్మల ఆసుపత్రిలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఎం ఓ యు ఒప్పంద పత్రాలను నిర్మల ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ రంజిత్ కుమార్,కూరపాటి రమేష్ లు పరస్పరం మార్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తొర్రూరు వంటి గ్రామీణ ప్రాంతాలకు సైతం అధునాతన లాప్రోస్కోపిక్ సేవలు అందుబాటులోకి తెచ్చే ఉద్దేశంతో కూరపాటి లాప్రోస్కోపిక్ సెంటర్తో నిర్మల ఆసుపత్రి ఒప్పందం కుదుర్చుకుందని తెలిపారు. సంప్రదాయ ఆపరేషన్లకు భిన్నంగా లాప్రోస్కోపిక్ విధానంలో చిన్నపాటి రంధ్రాల సాయంతో జల్లెడ లాంటి మిషన్ ను అమర్చి సులువుగా హెర్నియా వంటి సమస్యను పరిష్కరించవచ్చని తెలిపారు. లాప్రోస్కోపిక్ పద్ధతిలో పెద్ద ఆపరేషన్ల మాదిరి వారాల తరబడి ఆసుపత్రిలో ఉండాల్సిన అవసరం లేదని, చాలావరకు ఆపరేషన్లు చేసిన 24 నుండి 48 గంటలలోపు రోగిని డిశ్చార్జ్ చేయవచ్చని తెలిపారు. ప్రస్తుతం పిత్తాశయం తొలగింపు, అపెండిసైటిస్, హెర్నియా, గర్భాశయ సమస్యలు (గడ్డలు, ఫైబ్రాయిడ్స్), మరియు బేరియాట్రిక్ (బరువు తగ్గించే) సర్జరీలకు ఈ లాపరోస్కోపిక్ విధానాన్నే ప్రామాణికంగా ఉపయోగిస్తున్నారని తెలిపారు. నిర్మల ఆసుపత్రి కేంద్రంగా లాప్రోస్కోపిక్ ఆపరేషన్లు నిర్వహించేందుకు ఎం ఓ యు దోహదపడుతుందని తెలిపారు. ఈ సమావేశంలో నిర్మల హాస్పిటల్ వైద్యులు డాక్టర్ బి.శృతి తదితరులు పాల్గొన్నారు.



## 218 సర్వే నంబర్ నిర్వాసితులతో మాజీ మంత్రి హరీష్ రావు సమావేశం

ఖమ్మం: రఘునాథపాలెం మండలంలోని 218 సర్వే నంబర్ నిర్వాసితుల సమస్యలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎల్పీ డిప్యూటీ లీడర్ తన్నీరు హరీష్ రావు మంగళవారం సమావేశమయ్యారు. ఖమ్మం బురహాన్‌పురంలోని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎమ్మెల్సీలు తక్కళ్లపల్లి రవీందర్ రావు, తాతా మధుసూదన్, ఎర్రోళ్ల శ్రీనివాస్తో పాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాసితులు తమ సమస్యలను హరీష్ రావు దృష్టికి తీసుకువచ్చి, తమకు జరిగిన అన్యాయంపై వివరించారు. బాధితుల సమస్యలను విన్న ఆయన వెంటనే జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేసి నిర్వాసితులకు ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించి న్యాయం చేయాలని కోరారు. అలాగే, సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోకపోతే ఈ అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావిస్తానని హరీష్ రావు స్పష్టం చేశారు. నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు.



## డిపోమేనేజర్‌ను కలిసిన ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు

తొర్రూరు, జూన్ 23 వాయిస్ టుడే : తొర్రూర్ ఆర్టీసీ బస్ డిపో మేనేజర్ గా ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కె ప్రసూనలక్ష్మిని తొర్రూర్ డిపో ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్చం ,శాలువాతో సన్మానం చేసి పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా డిఎం మాట్లాడుతూ ఉద్యోగులంతా ఎవరి విధులు వాళ్ళ సక్రమంగా చేసుకోని డిపో అభివృద్ధికి సహకరించాలని అంతేకాకుండ ప్రయాణికులను తమ తమ గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చి డిపో ఆదాయాన్ని పెంచలన్నారు..గతంలో లాగానే రీజియన్ లోనే తొర్రూర్ డిపోను మొదటి స్థానంలో నిలిచే విధంగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ కుమార్, జె యాదగిరి,ఎంకే రావు, ఎస్ యాకన్న, ఎం. సతీష్, ఆర్ సత్తయ్య, వనజ, రాజేశ్వరి, శ్రీలత, రాధిక, టీ ధనుంజయ, టీవై రెడ్డి, డిపో ఉద్యోగులు పాల్గొన్నారు

## గుడుంబారహిత గ్రామాలే లక్ష్యం



తొర్రూరు, జూన్ 23 వాయిస్ టుడే : గుడుంబా రహిత గ్రామాలే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ఎక్సైజ్ సీఐ బూస అశోక్ తెలిపారు.పట్టణ శివారులో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రూట్ వాచ్ నిర్వహించారు.అనుమానస్పదంగా వెళ్తున్న ఆటోను ఆపి తనిఖీ చేయగా దానిలో పది లీటర్ల గుడుంబా స్వాధీనమైంది. రవాణా చేస్తున్న వ్యక్తి మండలంలోని అమర్ సింగ్ తండాకు చెందిన హపావత్ సుమన్ గా ఎక్సైజ్ పోలీసులు గుర్తించారు. వ్యక్తిని అదుపులోకి తీసుకొని గుడుంబాను స్వాధీనం చేసుకోవడంతో పాటు ఆటోను సీజ్ చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ....గుడుంబా తయారీకి వినియోగించే ముడిసరుకు రవాణా, విక్రయాలపై నిఘా ఉంచి నిరంతర దాడులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేసులో రెండోసారి పట్టుపడితే బీచ్ కేసు నమోదు, రిమాండ్, జరిమానా విధిస్తామని తెలిపారు. గుడుంబా తయారీ, రవాణా మానుకోకపోతే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని తెలిపారు. నాటు సారా తయారీ వివరాలు తెలిస్తే ఎక్సైజ్ పోలీసులకు సమాచారం అందించాలని, వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్సై రవళి రెడ్డి, ట్రైనీ ఎస్సై నాగ అమృత, హెడ్ కానిస్టేబుల్ మధు, కానిస్టేబుళ్లు శశివర్ధన్, సంపత్, శశికాంత్ లు పాల్గొన్నారు.




## రైతాంగ సమస్యలపై తెలంగాణ రైతుసంఘం ధర్నా

తొర్రూరు, జూన్ 23 వాయిస్ టుడే : సాగు భూమి కలిగిన ప్రతి రైతుకు యాప్ తో సంబంధం లేకుండా యూరియా సరఫరా చేయాలి అని, పెండింగ్ లో ఉన్న రైతు భరోసా నిధులు విడుదల చేయాలని, రైతు సంఘం జిల్లా నాయకులు బొల్లం అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం రోజు తొర్రూరు మండల కేంద్రంలో తెలంగాణ రైతు సంఘం తొర్రూరు మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి ఆర్ ఐ విక్రమ్ జూనియర్ అసిస్టెంట్ ప్రవీణ్ రెడ్డి లకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు బొల్లం అశోక్, మండల కార్యదర్శి కొత్త వెంకట్ రెడ్డిలు మాట్లాడుతూ, వ్యవసాయ సీజన్ ప్రారంభమైందని రైతులకు కల్తీ విత్తనాలు, పురుగుమందులు అందకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని, నాణ్యమైన విత్తనాలు రైతులకు సరఫరా చేయడం ద్వారా వ్యవసాయ ఉత్పత్తుల పెరుగుదలకు అవకాశం ఉంటుంది అని , కల్తీ,నాసిరకం విత్తనాలు పంపిణీ చేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. రైతు భరోసా నిధులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పంట కాలువలు మరమ్మతులు లేక చివరి భూములకు సాగునీరు ప్రవహించే అవకాశం లేకుండా పోయింది అని పంట కాలువలు మరమ్మతులు చేయాలి అని అన్నారు. రబి సీజన్లో మార్క్ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన మొక్కజొన్న రైతులకు పెండింగ్ డబ్బులను వెంటనే జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సంవత్సరం కరువు పరిస్థితులు రాబోతున్నట్టు తెలుస్తుందని అందుకోసం ప్రభుత్వం తక్షణ స్పందించి యాక్షన్ ప్లాన్ రూపొందించి రైతులను ఆదుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎండి యాకూబ్ , మండల అధ్యక్షురాలు అందే మంజుల రైతు సంఘం నాయకులు తాళ్ల వెంకటేశ్వర్లు వీరయ్య, కోటగిరి సంతోష్, శ్రీరంగం రాధా రామకృష్ణ, భాగ్య ,సమీనా, అమీనా, శ్రీలత ,లక్ష్మి ,స్వర్ణ, రైతు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఏబీవీపి ఆధ్వర్యంలో పాఠశాలల బంద్



తొర్రూరు, జూన్ 23 వాయిస్ టుడే : ప్రభుత్వ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా మంగళవారం ఏబీవీపి తెలంగాణ వ్యాప్తంగా పాఠశాలల బంద్‌కు పిలుపునిచ్చిన సందర్భంగా తొర్రూరు లో ఏబీవీపి తొర్రూరు శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల బంద్ నిర్వహించారు. ఈసందర్భంగా ఏబీవీపి తొర్రూరు మండల కన్వీనర్ మనోజ్ మాట్లాడుతూ ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల దోపిడీని అరికట్టేందుకు ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్‌టీచింగ్, ఎంఈఓ, డీఈఓ పోస్టులను భర్తీ చేయాలని, విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, యూనిఫాంలు, బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్, నాణ్యమైన భోజనం కల్పించాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేర్చకపోతే ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.బిప్రైవేట్ పాఠశాలలో బుక్స్,డ్రెస్,షూస్ పేరుతో విద్యార్థుల నుంచి వేలాది రూపాయలు వసూలు చేసి విద్యాసంస్థలను వ్యాపార కేంద్రాలుగా మారుతున్నాయి అని వెంటనే ప్రభుత్వం పూర్తిగా నియంత్రణ చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమం లో కె. రాజు, ఎం.సాయి, కె.ప్రశాంత్, వి.హర్ష తదితరులు పాల్గొన్నారు.



## డా. శ్యాం ప్రసాద్ ముఖర్జీ గొప్ప జాతీయవాది, విద్యా వేత్త

### మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

సికింద్రాబాద్, జూన్ 23 (వాయిస్ టుడే ప్రతినిధి): దేశవ్యాప్తంగా అనేక ప్రజా ఉద్యమాలు నిర్వహించి, తన ప్రాణాలు అర్పించిన గొప్ప జాతీయ వాది, విద్యావేత్త డా శ్యాం ప్రసాద్ ముఖర్జీ అని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ కొనియాడారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్, రాంనగర్ లోని ఆయన నివాసంలో జన సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ జాతీయ సమైక్యత సమగ్రతల కోసం కట్టుబడి ఉన్న శ్యాంప్రసాద్ ముఖర్జీ అహర్నిశలు కృషి చేశారన్నారు. కాశ్మీర్ కు ప్రత్యేక రాజ్యాంగం ప్రత్యేక ప్రధాని ఉండరాదని ఒకే దేశంలో రెండు రాజ్యాంగాలు, రెండు జెండాలు ఉండవని నినదించి, కాశ్మీర్ విలీనం కోసం ఆందోళనలు నిర్వహించారన్నారు. నేటితరం ఆయన సేవలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఆయన ఈ త్యాగ (బలిదాన్ ) ఫలితంగానే భవిష్యత్తులో జమ్ము కాశ్మీర్ కు ప్రత్యేక ప్రతి పదికను కల్పించే ఆర్టికల్ 370 రద్దు చేసిన ప్రధాని నరేంద్ర మోదీ కి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కైలాస్ నాగేష్, ఓం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



## అశ్వారావుపేటలో బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వారావుపేట: కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర వ్యాఖ్యానించారు. మంగళవారం అశ్వారావుపేటలో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మాజీ మంత్రులు తన్నీరు హరీష్ రావు, పువ్వాడ అజయ్ కుమార్, ఎమ్మెల్సీలు తక్కళ్లపల్లి రవీందర్ రావు, తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, రేగా కాంతారావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయడం లేదని విమర్శించారు. రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయకపోవడం, యూరియా కొరత, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు వంటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు తిరిగి ముఖ్యమంత్రిగా రావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా రాష్ట్రంలో అత్యధిక స్థానాలు బీఆర్ఎస్ గెలుచుకుని కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశానికి వందలాది మంది కార్యకర్తలు హాజరై గులాబీ కండువాలు ధరించి పాల్గొన్నారు.



## సింగరేణి కార్మికుల సమస్యలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో అవగాహన కార్యక్రమం

కొత్తగూడెం: మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ లీడర్ తన్నీరు హరీష్ రావు కొత్తగూడెం క్లబ్ హాలులో జరిగిన తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో "కాంగ్రెస్ హటావో--సింగరేణి బచావో", "నాడు సిరుల గని--నేడు కుంభకోణాల ఖని", "కాంగ్రెస్ హయాంలో కన్నీరు పెడుతున్న సింగరేణి" వంటి నినాదాలతో కార్మికుల సమస్యలపై అవగాహన కల్పించేలా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు తక్కళ్లపల్లి రవీందర్ రావు, తాతా మధుసూదన్, మాజీ మంత్రులు వనమా వెంకటేశ్వరరావు, పువ్వాడ అజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు రేగా కాంతారావు, హరిప్రియ హరిసింగ్ నాయక్, మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ కాపు సీతామహాలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి పెద్ద సంఖ్యలో సింగరేణి కార్మికులు, బీఆర్ఎస్ శ్రేణులు హాజరయ్యారు. "జై తెలంగాణ", "జై సింగరేణి", "కేసీఆర్ నాయకత్వం వర్ధిల్లాలి" వంటి నినాదాలు మారుమోగాయి. కార్యక్రమం సుమారు రెండు గంటలపాటు కొనసాగింది.

RNI No: TGTEL/25/A2649 VOICE OF PRAJALU
వాయిస్ ఆఫ్ ప్రజలు
ప్రజల గొంతుక - నిజం కోసం.. తెలుగు దినపత్రిక
హైదరాబాద్
బుధవారం 24 జూన్ 2026



## ప్రతి విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

**మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి**

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్.. వీర్నపల్లి కేజీబీవీలో తనిఖీ**

రాజన్న సిరిసిల్ల జిల్లా, జూన్ 23 (వాయిస్ టుడే); ప్రతి విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వీర్నపల్లి మండల కేంద్రం లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం లో జిల్లా కలెక్టర్ మంగళవారం తనిఖీ చేశారు. ముందు గా ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల హాజరు రిజిస్టర్ పరిశీలించారు.అక్కడి నుంచి కిచెన్ లోకి వెళ్లి బియ్యం నాణ్యత ను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం ఈ రోజు ఏ ఏ ఆహార పదార్థాలు సిద్ధం చేస్తున్నారో పరిశీలించారు. స్టోర్ రూమ్ లో పప్పులు, నూనె, నెయ్యి, ఇతర పదార్థాల నాణ్యత, గడువు తేదీని తనిఖీ చేశారు. ఆహార పదార్థాల నిల్వకు సంబంధించి పలు సూచనలు చేశారు. విద్యార్థులకు కచ్చితంగా మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం ఇవ్వాలని ఆదేశించారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ విద్యార్థులు అందరూ తరగతులకు హాజరయ్యాలా చూడాలని సూచించారు. విద్యార్థులు ప్రణాళిక ప్రకారం పాఠ్యాంశాలు శ్రద్ధగా చదువుకోవాలని తెలిపారు. పరిశీలన లో మండల ప్రత్యేక అధికారి క్రాంతి, తహసీల్దార్ నారాయణ రెడ్డి, సర్పంచ్ జ్యోత్స్న తదితరులు ఉన్నారు.





## పెద్దమ్మ తల్లి మహోత్సవాలకు ప్రముఖులకు ఆహ్వానాలు

**మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్‌కు ఆహ్వాన పత్రికల అందజేత**

చిగురుమామిడి, జూన్ 23 (వాయిస్ ఆఫ్ ప్రజలు): కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలో అత్యంత వైభవంగా నిర్వహించనున్న శ్రీ పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలకు ప్రముఖ ప్రజాప్రతినిధులు, సామాజిక నాయకులకు ఆహ్వాన పత్రికలను అందజేశారు. తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కూనచ్చుల మహేందర్, తెలంగాణ ముదిరాజ్ మహాసభ చిగురుమామిడి మండల అధ్యక్షుడు పెసరి రాజేశం ఆధ్వర్యంలో చిగురుమామిడి మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ప్రతినిధులు పలువురు ప్రముఖులను కలిసి ఉత్సవాలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్, తెలంగాణ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ముదిరాజ్, మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ మాజీ అభ్యర్థులు నీలం మధు, కవిత దంపతులను కలిసి ఆహ్వాన పత్రికలను అందజేశారు. మహోత్సవాల ప్రాధాన్యతను వివరించి, కార్యక్రమాలకు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

జూన్ 27 నుంచి జూలై 2 వరకు వారంరోజుల పాటు జరిగే ఈ మహోత్సవాల్లో ప్రత్యేక పూజలు, యాగాలు, భక్తి కార్యక్రమాలు, సాంస్కృతిక వేడుకలు, ఆధ్యాత్మిక సభలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పెద్దమ్మ తల్లి ఆశీస్సులతో గ్రామాభివృద్ధి, ప్రజల సుఖసంతోషాల కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ఉత్సవాలను ఘన విజయవంతం చేసేందుకు ముదిరాజ్ సంఘ నాయకులు, గ్రామ పెద్దలు, యువత, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సహకరించాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో చిగురుమామిడి మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు చెరుకు సంజీవ్, కుల సంఘం పెద్దమనిషి చెరుకు చిన్నసమ్మయ్య, సంఘం మాజీ అధ్యక్షుడు పొన్నం వెంకట్రాజయ్య, డైరెక్టర్ జెట్టి సమ్మయ్య, సభ్యుడు పొన్నం మల్లయ్య పాల్గొన్నారు.



## భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులు అర్పించిన బిజెపి నాయకులు

నర్సాపూర్ (వాయిస్ టుడే) : డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా హత్నూర మండల పరిధిలోని కాసాల దౌల్తాబాద్ లో బిజెపి పార్టీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ ప్రతి పౌరుడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆయన అడుగుజాడల్లో నడవాలని వారు అన్నారు ఈ కార్యక్రమంలో హత్నూర మండల్ బిజెపి పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీశైలం సీనియర్ బిజెపి నాయకులు తోట రాజు పటేల్ రెడ్డి ఖానాపూర్ గ్రామ ఉప సర్పంచ్ మహేష్ మంగాపూర్ ఉప్ప సర్పంచ్ కుమార్ బిజెపి సీనియర్ నాయకులు రాజేష్ పలువురు బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సర్‌పై అప్రమత్తంగా ఉండాలి

**నా బూత్ నా బాధ్యత అన్న నినాదంతో పని చేయాలి**

**కాంగ్రెస్ మోసాలను వివరిస్తూ ప్రజలకు అండగా ఉందాం**

**ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్**



హనుమకొండ,వాయిస్ టుడే: సర్ పై అప్రమత్తంగా ఉండాలని,నియోజకవర్గ పరిధిలోని డివిజన్ స్థాయిలోని బూత్‌ల వారీగా బీఎల్‌ఏలు అందరు వారివారి పోలింగ్ బూత్ పరిధిలో క్షేత్ర స్థాయిలో తిరగాలని ప్రభుత్వ చీఫ్ విప్,బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ సూచించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 7వ డివిజన్ పరిధిలోని బీఎల్‌ఏల సమావేశాన్ని మంగళవారం హన్మకొండలోని భారత రాష్ట్ర సమితి పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ జూన్ 25 నుంచి ఎస్ఐఆర్ ప్రక్రియ మొదలుకాబోతోందని అన్నారు. ఓటర్‌ను ప్రత్యక్షంగా కలుస్తూ... ఓటర్ మ్యాపింగ్ చేయించాలని తెలిపారు. సర్ ప్రక్రియపై అప్రమత్తంగా ఉంటూ ఓటరు నమోదుకు,ఓటరు ఓటును కాపాడే బాధ్యతను తీసుకోవాలని అన్నారు. బీఎల్‌వోలతో కలిసి పని చేస్తూ ప్రతీ ఓటరును కలవాలని సూచించారు. నా బూత్ నా బాధ్యత అన్న నినాదంతో పని చేయాలని తెలిపారు.

పార్టీ కోసం నిబద్ధత పని చేసేవారికి తప్పకుండా అవకాశాలు వస్తాయని భరోసానిచ్చారు. కష్టకాలంలో పార్టీకి కార్యకర్తలకు తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని నాయకులకు సూచించారు. ప్రజా సమస్య పరిష్కారమే ఎజెండాగా పని చేయాలని అన్నారు. ప్రజలను ఇబ్బందిపెడుతున్న పాలక పక్షాన్ని ఎండగట్టేందుకు కలిసి పోరాడుదామని పిలుపునిచ్చారు. కక్షపూరిత రాజకీయాలను సైతం ధైర్యం,న్యాయస్థానాల పరిధిలో ఎదుర్కొందామని అన్నారు. కాంగ్రెస్ మోసాలను ప్రజలకు వివరిస్తూ... పార్టీగా, నాయకులుగా ప్రజలకు అండగా ఉందామని తెలిపారు. రానున్న రోజుల్లో పార్టీ బలోపేతంలో భాగంగా సభ్యత్వ నమోదు చేపట్టనున్నారు. నిజాయితీగా,నిబద్ధతతో పార్టీ కోసం పని చేస్తున్నవారిని పార్టీ గుర్తించి పార్టీ పదవులు సైతం వస్తాయని అన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వాన్ని సంఖ్యగా కాకుండా బలమైన పార్టీ పునాది కోసం చేపడదామని పిలుపునిచ్చారు. పార్టీని అంటిపెట్టుకొని ఉన్నవారిని తాను,పార్టీ కచ్చితంగా గుర్తుపెట్టుకుంటుందని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో కార్యకర్తలు,నాయకుల అభీష్టం మేరకే పార్టీ తాను నడుచుకుంటానని అన్నారు.



## బిజెపి పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి

జమ్మికుంట జూన్ 23 (వాయిస్ టుడే): జమ్మికుంట పట్టణ బిజెపి అధ్యక్షుడు కొలకాని రాజు ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీ చౌరస్తాలో బిజెపి శ్రేణులు శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈసందర్భంగా కొలకాని రాజు, శీలం శ్రీనివాస్, జీడి మల్లేష్ లు మాట్లాడుతూ కలకత్తా నగరంలో జన్మించిన శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిన్న వయసులోనే బెంగాల్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు అని, స్వాతంత్ర్యం తరువాత 1947 నుండి 1950 సంవత్సరం వరకు నెహ్రూ క్యాబినెట్ లో కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రిగా పనిచేశారు, ఆసమయంలో నెహ్రూ జమ్మూ ఱ కాశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించిన ఆర్టికల్ 370 మరియు అప్పటి ప్రత్యేక అనుమతి వ్యవస్థకు వ్యతిరేకంగా ఉద్యమించి, కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసి, 1951లో భారతీయ జన్ సంఘ్ ను స్థాపించారని, జన్ సంఘ్ జాతీయ అధ్యక్షుడిగా జమ్మూ కాశ్మీర్ లో"ఒక దేశంలో రెండు రాజ్యాంగాలు, రెండు ప్రధానులు,

రెండు జెండాలు ఉండవు"అనే నినాదంతో దేశ ప్రజల మద్దతు కూడగట్టేందుకు కాశ్మీర్ పర్యటనకు వెళ్లిన శ్యామా ప్రసాద్ ముఖర్జీ ని అప్పటి ప్రధాని నెహ్రూ, కాశ్మీర్ ప్రభుత్వాలు కలిసి యాత్రను అడ్డుకుని జమ్మూ కాశ్మీర్ జైల్లో 40 రోజులపాటు నిర్బంధంలో ఉంచారు అన్నారు. జూన్ 23వ తేదీన జైల్లోనే శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ మరణించారు, ఆయన మరణ వార్త అప్పట్లో దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది, ఆయన ఆశయాలను కొనసాగిస్తూ నరేంద్ర మోడీ 2019 ఆగస్టు 5న భారత ప్రభుత్వం జమ్మూ ఱ కాశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించిన ఆర్టికల్ 370లోని ఎక్కువ భాగాన్ని రద్దు చేసిందని కొనియాడారు, భారత రాజకీయ చరిత్రలో శ్యామా ప్రసాద్ ముఖర్జీ ముఖ్యమైన వ్యక్తిగా గుర్తింపు పొందారని తెలిపారు. ఈకార్యక్రమంలో ఆకుల రాజేందర్, కైలాసకొటి గణేష్, ఆకుల తిరుపతి, నిరుపమా రాణి,కేస స్వరూప, పల్లపు రవి, గంగాభవాని, బచ్చు శివన్న, మోర్చ అధ్యక్షులు నసీరుద్దీన్, ఆకుల పోచయ్య, తుర్పాటి శంకర్, పసునూటి శివ, పనికారి రమేష్, పొడేటి అనిల్, అశోక్, ఉడుగుల మహేందర్, మురికి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మగౌరవ సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ




ఖమ్మం , జూన్ 23(వాయిస్ టుడే ): ఈ నెల 28వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న "తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సమ్మేళనం" పోస్టర్‌ను తెలంగాణ ఉద్యమ నాయకులు ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పిడమర్తి రవి, డాక్టర్ కె.వి. కృష్ణారావు, నందిగామ రాజ్ కుమార్ జానీ, బొబ్బిలి భరత్ చంద్ర, వేల్పుల మురళీ, విజయ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం వేలాది మంది ఉద్యమకారులు తమ జీవితాలను త్యాగం చేశారని, వారి పోరాట ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని అన్నారు. అయితే రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులు నేటికీ అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, నెలకు రూ.25,000 గౌరవ పెన్షన్, ప్రత్యేక ఆరోగ్య బీమా సౌకర్యం, ప్రభుత్వ సంక్షేమ పథకాలలో ఉద్యమకారుల ప్రత్యేక కోటా, అలాగే ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈ తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ అమరవీరుల ఆశయాల సాధన, ఉద్యమకారుల గౌరవ పరిరక్షణ మరియు వారి హక్కుల సాధనే లక్ష్యంగా ఈ సమ్మేళనం జరుగుతుందని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులు, విద్యార్థి నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, యువత పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# మృతుల కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్ కుమార్

**దేవసాని గణపతి రెడ్డి సేవలు చిరస్మరణీయం : సతీష్ కుమార్**

**బత్తిని సత్తయ్య గౌడ్ మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటు**



చిగురుమామిడి, జూన్ 23 (వాయిస్ ఆఫ్ ప్రజలు): మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రముఖుల మృతితో విషాదంలో ఉన్న కుటుంబాలను హుస్నాబాద్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్ కుమార్ సోమవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. నవాబుపేట గ్రామానికి చెందిన రిటైర్డ్ తహసీల్దార్ దేవసాని గణపతి రెడ్డి, సుందరగిరి గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు బత్తిని సత్తయ్య గౌడ్, అలాగే మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు పత్తేం వీరస్వామి సతీమణి పద్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా వారి నివాసాలకు వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా దేవసాని గణపతి రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన సతీష్ కుమార్, ఆయన రెవెన్యూ శాఖలో చేసిన సేవలను స్మరించుకున్నారు. కమలాపూర్, భీమదేవరపల్లి, మానకొండూర్, తిమ్మాపూర్ మండలాలతో పాటు ఎల్ఎండీ పరిధిలో తహసీల్దార్‌గా సుమారు 36 సంవత్సరాల పాటు ప్రజలకు అంకితభావంతో సేవలందించి మంచి పేరు, గుర్తింపు సంపాదించుకున్నారని కొనియాడారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఆయన చూపిన నిబద్ధత ఆదర్శనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన కుమారులు దేవసాని శ్రీనివాస్ రెడ్డి, ఫస్ట్ క్లాస్ సివిల్ కాంట్రాక్టర్ దేవసాని కిరణ్ కుమార్ రెడ్డిని పరామర్శించి ధైర్యం చెప్పారు.

అనంతరం సుందరగిరి గ్రామంలో బత్తిని సత్తయ్య గౌడ్ కుటుంబ సభ్యులను కలిసిన మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఆయన చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. రైతు సమస్యల పరిష్కారానికి, పార్టీ బలోపేతానికి ఆయన చేసిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. సత్తయ్య గౌడ్ మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని, కుటుంబ సభ్యులు అధైర్యపడవద్దని, పార్టీ అండగా ఉంటుందని ఆయన కుమారుడు బత్తిని రవీందర్ గౌడ్‌కు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు కొత్త శ్రీనివాస్ రెడ్డి, మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, సింగిల్ విండో చైర్మన్ జంగా వెంకటరమణారెడ్డి, సర్పంచ్ జంగా శిరీష రెడ్డి, ఉపసర్పంచ్ మెడబోయిన రాజు, బీసీ సెల్ మండల అధ్యక్షుడు హనుమడ్ల సత్యనారాయణ, గ్రామ శాఖ అధ్యక్షుడు కొమ్ము కొమురయ్య, ఎస్. కె. సిరాజ్ పాషా, ఎండి సర్వర్ పాషా, కూతురు శరభందన్ రెడ్డి, తాళ్లపల్లి సంపత్ గౌడ్, మక్బూల్ పాషా, కాశవేని నరసయ్య, గందె సంపత్, దోనపాటి కృష్ణారెడ్డి, గందె ప్రశాంత్, పోతరవేణి రాజయ్య యాదవ్, దామ శ్రీనివాస్, పోతరేణి ఆగయ్య, సంధి శ్రీనివాస్ రెడ్డి, రవి, కక్కెర్ల లక్ష్మి, బద్దం మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సాగర్ సందర్శించిన పర్యావరణ విదేశీ ప్రతినిధులు

నాగార్జునసాగర్, జూన్, 23: వాయిస్ టుడే: భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ శిక్షణ కార్యక్రమంలో భాగంగా అంతర్జాతీయ పర్యావరణ ప్రతినిధులు నాగార్జునసాగర్ ను మంగళవారం సందర్శించారు. ఆసియా,ఆఫ్రికా ఖండాలకు చెందిన 16 దేశాల నుండి 36 మంది విదేశీ పర్యావరణ ప్రతినిధులు హైదరాబాదులోని పర్యావరణ పరిరక్షణ శిక్షణ పరిశోధనా సంస్థలో గత కొన్ని రోజులుగా పర్యావరణ సామాజిక ప్రభావం అనే అంశంపై శిక్షణ పొందుతున్నారు. ఆ శిక్షణలో భాగంగా తెలంగాణ పర్యావరణ అటవీ, విజ్ఞాన మరియు సాంకేతిక శాఖ ముఖ్య కార్యదర్శి, పర్యావరణ పరిరక్షణ శిక్షణ పరిశోధన సంస్థ డైరెక్టర్ జనరల్ అహ్మద్ నదీమ్, నల్గొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ పర్యవేక్షణలో మంగళవారం బహుళార్థక సాధక ప్రాజెక్టు అయిన నాగార్జునసాగర్ ను సందర్శించారు. దీనిలో భాగంగా సాగర్ లోని విజయ విహార్ అతిథి గృహానికి చేరుకున్న ఈ బృందానికి నల్గొండ జిల్లా ట్రైనీ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, మిర్యాలగూడ ఆర్ డి ఓ రమణారెడ్డి లు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వీరు నాగార్జునసాగర్ డ్యామ్ ను సందర్శించారు. నాగార్జునసాగర్ డ్యాం నిర్మాణం కారణంగా ప్రయోజనాలు, నీటి నిలువలు, నీటి సామర్థ్యము, ఎంత మేరకు లబ్ధిదారులకు పునరావాసం కల్పించారు, నిర్మాణం తర్వాత పర్యావరణ పై ప్రభావం గురించి డ్యామ్ ఇంజనీర్లు వారికి తెలియజేశారు. అనంతరం నాగార్జునసాగర్ ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని సందర్శించారు.అక్కడ జెన్కో ఇంజనీర్లు నాగార్జునసాగర్ లో విద్యుత్ ఉత్పత్తి వివరాలను



పర్యావరణ విదేశీ ప్రతినిధుల బృందానికి తెలియజేశారు. సాగర్ సందర్శనలో భాగంగా ఈ బృందం నాగార్జునసాగర్ లో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన బుద్ధవనాన్ని సందర్శించారు. బుద్ధవనం సందర్శనలో భాగంగా బుద్ధ చరిత వనములోని బుద్ధుని పాదాల వద్ద పుష్పాంజలి ఘటించారు. అనంతరం వీరు బుద్ధ చరిత వనం, ధ్యానవనం, స్తూపవనాలను సందర్శించి మహాస్థూపంలోని సమావేశ మందిరంలో బుద్ధవనం విశేషాలు తెలియజేసే లఘు చిత్రాన్ని వీక్షించారు. బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన, ఎస్టేట్ ఆఫీసర్ రవిచంద్రలు మహా స్తూపంలోని ధ్యాన మందిరంలో ఈ బృందంచే ధ్యానం గురించి, బౌద్ధం గురించి వివరించారు. వీరికి స్థానిక టూరిజం గైడు సత్యనారాయణ సాగర్, బుద్ధవనం విశేషాలను వివరించారు. వీరితోపాటు పర్యావరణ పరిరక్షణ శిక్షణ పరిశోధన సంస్థకు క్లైమేట్ చేంజ్ మరియు ట్రైనింగ్ సెంటర్ హెడ్ డాక్టర్ రాజేశ్వర్, సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్ ప్రవీణ్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ షేక్ అల్లావలి, చెందిన ప్రోటోకాల్ ఆఫీసర్ ఖాదర్,పెద్దవూర తాసిల్దార్ కాశీం, ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ సంగీత, సాగర్ సిఐ శ్రీను నాయక్, డ్యాం ఇంజనీర్లు అశోక్, విజయ్, జెన్కో ఇంజనీర్లు వరప్రసాద్, వెంకటరమణ,ఎస్ పి ఎఫ్ ఇన్స్పెక్టర్లు శ్రీనివాసరావు, శ్రీధర్ గౌడ్,స్థానిక ఎస్ ఐ సతీష్, ప్రోటోకాల్ ఆఫీసర్ దండా శ్రీనివాస్ రెడ్డి, ఎస్ పి ఎఫ్ ఎస్ ఐ రఘు తదితరులు ఉన్నారు.

# రైతుల ఉసురు తీస్తున్న కాంగ్రెస్ సర్కార్ నిప్పులు చెరిగిన బి.ఆర్.ఎస్!

## కోనరావుపేట మండల బి.ఆర్.ఎస్ అధ్యక్షులు మల్యాల దేవయ్య నాయకత్వంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై భారీ ధర్నా కార్యక్రమం



కోనరావుపేట, జూన్ 23(వాయిస్ టుడే): రాజన్న సిరిసిల్ల జిల్లా, కోనరావుపేట మండలంలో రైతుల సమస్యలపై బి.ఆర్.ఎస్ పార్టీ గళమెత్తింది. మండల అధ్యక్షులు మల్యాల దేవయ్య గారి ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఈ సందర్భంగా రైతులు, బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ముఖ్యంగా రైతులకు నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. రైతు బంధు, రైతు బీమా పథకాల అమలులో నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని, కౌలు రైతులకు కూడా రూ.12,000 ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చి, దానిని అమలు చేయకుండా రైతులను మోసం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు.

వడ్ల కుంభకోణంపై దర్యాప్తుకు డిమాండ్: అదేవిధంగా, ఇటీవల చోటుచేసుకున్న వడ్ల లోడ్ల మాయం కుంభకోణంపై వెంటనే సమగ్ర దర్యాప్తు చేపట్టాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన రైతులకు తక్షణమే పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రైతు వ్యతిరేక విధానాలను ప్రజలు గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో తగిన గుణపాఠం చెబుతారని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ మండల అధ్యక్షులు మల్యాల దేవయ్య గారితో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, యువ నాయకులు మరియు భారీ సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.




# అడ్మిషన్ల పెంపుదల కోసం కృషి చేయాలి

## ఇంటర్మీడియట్ విద్యాధికారి దస్ర

నాగార్జునసాగర్ జూన్ 23 : ఇంటర్మీడియట్ కళాశాలలో అడ్మిషన్ల పెంపుదల కోసం కృషి చేయాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రామావత్ దస్రు తెలిపారు. మంగళవారం నాగర్జున సాగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా ఆయన తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన అధ్యాపకులతో మాట్లాడుతూ... ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు పెంపుదల కోసం అధ్యాపకులు కృషి చేయాలని కోరారు. ఇప్పటికే కళాశాలలో చేరే విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు అందిస్తున్నామని తెలిపారు. ఇంట్రాక్టివ్ పానల్స్ ద్వారా విద్యాబోధన నిర్వహిస్తున్నందున విద్యార్థులకు ఆన్లైన్ ద్వారా అందించాలని సూచించారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను విద్యార్థులకు చేరువ చేయాలని ఆయన కోరారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు విద్యార్థుల పైన వ్యక్తిగత శ్రద్ధతో బాధ్యతగా పనిచేయాలని కోరారు. విద్యార్థులకు సాయంకాలం వెళ్ల విధిగా ఆటలు ఆడించాలని కోరారు ఆయన వెంట డిఐఈఓ కార్యాలయ పర్యవేక్షకులు సతీష్ ఇంచార్జి ప్రిన్సిపాల్ చింతపల్లి వెంకటయ్య, అధ్యాపకులు జనార్ధన్ ఉపేంద్ర చారి శంకర్ వినోద్ సిబ్బంది ఉన్నారు.

# వార్షిక తనిఖీలలో భాగంగా సంగారెడ్డి జిల్లామహిళా పోలీస్ స్టేషన్, సీసీఎస్, హత్నూర పోలీస్ స్టేషన్ను తనిఖీ చేసిన ఎల్.ఎస్. చౌహాన్, ఐపీఎస్.,

సంగారెడ్డి జిల్లా (వాయిస్ టుడే) హత్నూర పోలీస్ స్టేషన్ల ఆవరణ పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది కిట్ ఆర్టికల్స్ను పరిశీలించిన డీఐజీ ఫిర్యాదిదారులతో మర్యాదగా మాట్లాడి, వారి సమస్యలను ఓపికగా విని వారిలో భరోసా కల్పించాలని సూచన ఆయన సూచించారు. సంగారెడ్డి మహిళా పోలీస్ స్టేషన్, సీసీఎస్, హత్నూర పోలీస్ స్టేషన్లను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్.తో కలిసి స్టేషన్ ఆవరణలో మొక్కలను నాటారు. అనంతరం స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, సిబ్బంది బ్యారక్స్, స్టేషన్ రికార్డుల నిర్వహణను పరిశీలించారు. స్టేషన్ రికార్డులను తనిఖీ చేస్తూ ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు నిర్వహించాలని, మిస్సింగ్ కేసులు మరియు దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న కేసుల చేదనకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి త్వరితగతిన పరిష్కరించాలన్నారు. మారుతున్న సమాజ అవసరాలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ అందుబాటులోకి తీసుకువచ్చిన సీసీటీఎన్ఎస్--2.0, పిటిషన్ మేనేజ్మెంట్ సిస్టమ్, టీఎస్-కాప్, హెచ్ఆర్ఎంఎస్ అప్లికేషన్లపై పూర్తి స్థాయి అవగాహన పెంపొందించుకొని, నేరాల నియంత్రణలో సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించాలని డిఐజి సూచించారు. పోలీస్ స్టేషన్కు వచ్చిన ఫిర్యాదిదారులతో మర్యాదగా మాట్లాడాలని, వారి సమస్యలను ఓపికగా విని తగిన పరిష్కారం చూపుతామనే భరోసాను కల్పించాలని తెలిపారు. ప్రతి ఫిర్యాదును ఆన్లైన్లో నమోదు చేయడంతో పాటు, ప్రతి ఫైల్ను నిర్ణీత గడువులోగా సీసీటీఎన్ఎస్లో అప్లోడ్ చేయాలని సూచించారు. స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లు, సస్పెక్ట్ హిస్టరీ షీటర్ల వివరాలను సమీక్షిస్తూ వాటిని ఎప్పటికప్పుడు ఆన్లైన్లో నమోదు చేయాలని ఆదేశించారు. పగలు, రాత్రి బీట్ విధుల్లో భాగంగా అనుమానిత వ్యక్తుల వేలిముద్రలను పాపిలాన్ డివైస్ ద్వారా తనిఖీ చేసి పాత




నేరస్తులను గుర్తించాలని సూచించారు.

సంగారెడ్డి జిల్లా పరిశ్రమలకు కేంద్రంగా ఉండటంతో వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు ఉపాధి కోసం ఇక్కడికి వస్తారని, తద్వారా ఆర్థిక నేరాలు, ఆస్తి సంబంధిత నేరాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. అధిక నేరాలు నమోదవుతున్న ప్రాంతాలను క్రైమ్ ప్రోన్ ఏరియాలుగా గుర్తించి, వాటిపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. నేరాల నియంత్రణ, నేరాల ఛేదనలో సీసీ కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరించి, స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలని ఎస్.హెచ్.ఓలకు సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాల నియంత్రణ కోసం కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. విజిబుల్ పోలీసింగ్లో భాగంగా ప్రతిరోజూ వాహనాల తనిఖీలు నిర్వహిస్తూ, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని, ప్రతి ఒక్కరు తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వర్తించినప్పుడే పోలీస్ శాఖకు మంచి పేరు వస్తుందని అన్నారు. పోలీస్ స్టేషన్ల నిర్వహణ, రికార్డుల మెయింటెనెన్స్ సంతృప్తికరంగా ఉన్నాయని పేర్కొంటూ అధికారులు, సిబ్బందిని డీఐజీ ఎల్.ఎస్. చౌహాన్, ఐపీఎస్. ప్రత్యేకంగా అభినందించారు. ఈ తనిఖీలలో డీఐజీ ఎల్.ఎస్. చౌహాన్, ఐపీఎస్. వెంబడి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్., అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ఐపీఎస్., సంగారెడ్డి డీఎస్పీ సత్యయ్య గౌడ్, పటాన్చెరు డీఎస్పీ ప్రభాకర్, జిన్నారం సీఐ రమణారెడ్డి హత్నూర ఎస్ఐ శ్రీధర్ రెడ్డి ఆయా పోలీస్ స్టేషన్ల ఎస్.హెచ్.ఓలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# శ్రీ పడమటి ఆంజనేయస్వామి ఆలయానికి రాజగోపురం రూ.50 లక్షలతో నిర్మాణానికి శ్రీకారం

మక్తల్ జూన్ 23 వాయిస్ టుడే ప్రతినిధి: మక్తల్ ప్రాంత ప్రజల ఆరాధ్య దైవమైన శ్రీ పడమటి ఆంజనేయస్వామి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు తెలంగాణ రాష్ట్ర పాడి పశుసంవర్ధక, క్రీడలు, డెయిరీ, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ప్రత్యేక చొరవ చూపుతున్నారు. ఆలయానికి సరికొత్త హంగులు అద్దే క్రమంలో రాజగోపురం నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.50 లక్షలు మంజూరు చేయించారు. తెలంగాణతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల నుంచి కూడా వేలాది మంది భక్తులు ఈ ఆలయాన్ని సందర్శించి స్వామివారికి మొక్కులు చెల్లించుకుంటుంటారు. మక్తల్ ప్రాంతంలో ప్రసిద్ధి చెందిన ఈ ఆలయానికి రాజగోపురం నిర్మించాలని భక్తుల చిరకాల కోరికగా ఉండగా, దానిని సాకారం చేసే దిశగా చర్యలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 24వ తేదీ ఉదయం 8 గంటలకు రాజగోపుర నిర్మాణానికి మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి భూమిపూజ నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం దేవాదాయ శాఖ అధికారులు ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలించారు. రాజగోపుర నమూనాను ఖరారు చేయడంతో పాటు భూమిపూజ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను సమీక్షించారు. రాజగోపుర నిర్మాణ భూమిపూజ కార్యక్రమానికి మక్తల్ ప్రాంత ప్రజలు, భక్తులు, హిందూ బంధువులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఆలయ అధికారులు కోరారు. ఈ పరిశీలన కార్యక్రమంలో దేవాదాయ శాఖ డిప్యూటీ ఈఈ ఓం ప్రకాష్ రావు, ఏఈ రణధీర్, ఆలయ ఈవో నిత్యానందాచారి, వంశపారంపర్య ధర్మకర్త ప్రాణేశాచారి, ఎండోమెంట్ ఇన్స్పెక్టర్ కవిత, అర్చకులు అరవిందాచారి, సిబ్బంది శ్రీనివాస్, కాంగ్రెస్ టౌన్ అధ్యక్షుటడు అల్కూరి రవికుమార్, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి వాదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదవశాత్తు తన నివాసం వద్ద జారీ పడి ఆనందరావు అనే వ్యక్తి మృతి

## కుటుంబ సభ్యులను పరామర్శించిన ప్రముఖ న్యాయవాది కె.వి రమణ,న్యాయవాదులు, టీడీపీ నాయకులు



కృష్ణా జిల్లా-గన్నవరం(వాయిస్ టుడే): ఉంగుటూరు(మం)వెల్డ్ పాడు గ్రామానికి చెందిన ఒక సామాజిక, కమ్యూనిస్టు పార్టీ అనుభవాలకు చెందిన వ్యక్తి కలపాల ఆనందరావు సోమవారం రాత్రి సుమారు 10 గంటల సమయం లో తమ నివాసం వద్ద ఇంటి వద్ద మెట్లు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారీ పడి తలకు వెనుక భాగంలో బలమైన గాయమైంది. కుటుంబ సభ్యులు హుటాహుటిన అతనిని గన్నవరం లోని ఒక ప్రవేట్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.. అప్పటికే ఆనందరావు మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు..అయనకు ప్రముఖ న్యాయవాది కెవి రమణ ఘన నివాళులర్పించారు.కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతో పాటు న్యాయ వాదులు,టీడీపీ నాయకులు నిడ మర్తి బుజ్జారావు,నల్లమోతు నానిబాబు,నిడమర్తి కృష్ణ,నల్లమోతు రమేష్, తదితరులు నివాళులు అర్పించిన అనంతరం అంతిమ యాత్రలో పాల్గొన్నారు...



# విత్తన మేళాను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

## హుగ్గెల్లీ గ్రామ సర్పంచ్ పట్లోళ్ళ.విమల శ్రీనివాస్ రెడ్డి

ఝురాసంగం, జూన్ 23 (వాయిస్ టుడే) : జహీరాబాద్ మండలంలోని హుగ్గెల్లీ గ్రామంలో రైతు వేదికలో మంగళవారం విత్తనాలు మేళ పంపిణీ కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారిణి లావణ్య.తో కలిసి ప్రారంభించిన హుగ్గెల్లీ గ్రామ సర్పంచ్ విమల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.... రైతులకు రెడ్అమ్, గ్రీన్రామ్, బ్లాక్గ్రామ్, సోయాబీన్ విత్తనాలతో పాటు నానో యూరియా, నానో డీఏపీ, కూరగాయల విత్తనాలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. హుగ్గెల్లి క్లస్టర్లో రైతులకు ఉచిత మినీ కిట్లను కూడా పంపిణీ చేసినట్లు వారు పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో క్లస్టర్ ఏఈవో, రైతులు,మహిళా రైతులు,గ్రామస్తులు మరియు తదితరులు పాల్గొన్నారు.



# రైతులకు విత్తనాలు పంపిణీ

మహబూబ్నగర్ జిల్లా జూన్ 23 జడ్చర్ల (వాయిస్ టుడే) : నవాబుపేట మండల కేంద్రం లో రైతు వెదికలలో విత్తన మేళ"రైతులకు అందబాటులలో రైతు వేదికలో తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయం శాఖ అద్వర్యం లో ఏర్పాటు చేసిన రైతు వైదికలో విత్తన మేళ కార్యక్రమాన్ని మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మెన్ విస్లావత్ తులసీరామ్ నాయక్ , నవాబుపేట సర్పంచ్ గీతరాణి, ఏవో కృష్ణ కిషోర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహమ్మద్ ఖాజా మైనోద్దీన్ ఎస్ ఐ జనార్దన్ ఏ ఈ ఓ లు మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆగ్రో రైతు సేవా కేంద్రం-3 నిర్వాహకులు మరియు రైతులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వాయిస్

హైదరాబాద్
బుధవారం 24 జూన్ 2026



## విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన సదస్సు

మహబూబ్నగర్ జిల్లా జూన్ 23 (వాయిస్ టుడే) : జడ్చర్ల / నవాబ్‌పేట మండలంలోని కేజీబీవీ పాఠశాల కళాశాలలో ఎస్సై ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సుమారు 150 మంది విద్యార్థినులు పాల్గొన్నారు.విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు,వాటి వలన ఆరోగ్యం,కుటుంబం సమాజంపై పడే దుష్ప్రభావాల గురించి వివరంగా అవగాహన కల్పించారు విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి, తమ విద్యపై దృష్టి సారించి, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు.మాదకద్రవ్యాల నిర్మూలనలో యువత కీలక పాత్ర పోషించాలని, అనుమానాస్పద కార్యకలాపాల గురించి వెంటనే పోలీసులకు100 కు డయల్ ద్వారా సమాచారం అందించాలని విద్యార్థులకు ఎస్సై నరేందర్ సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ మాధవి, విద్యార్థులు ఏ ఎస్ ఐ జనార్దన్, సురేష్, రాజు,శెట్టి నాయక్ పాల్గొన్నారు.



## వేద విద్య ప్రవేశ పరీక్షకు విశేష స్పందన

**- తొలి విడతలో 68 మంది విద్యార్థుల హాజరు**

**- త్వరలో రెండో విడత పరీక్ష**

ఝరాసంగం జూన్ 23 (వాయిస్ టుడే) : సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలంలోని బర్దిపూర్ శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమ వేద పాఠశాలలో 2026--27 విద్యా సంవత్సరానికి విద్యార్థుల ప్రవేశాల కోసం నిర్వహించిన తొలి విడత మౌఖిక



పరీక్ష మంగళవారం విజయవంతంగా జరిగింది. పరీక్షలకు వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 98 మంది దరఖాస్తు చేసుకోగా మంగళవారం నిర్వహించిన మౌఖిక పరీక్షకు తెలుగు మంచిర్యాల, బెల్లంపల్లి, హైదరాబాద్, నారాయణఖేడ్, కరీంనగర్, కల్వకుర్తి, పెద్దపల్లి, నిర్మల్, వికారాబాద్, కామారెడ్డి, ఆమనగల్, కొమరం భీమ్, ఆసిఫాబాద్, గిరవెల్లి, నిర్మల్, జహీరాబాద్ తో పాటు మహారాష్ట్ర కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 68 విద్యార్థులు హాజరై తమ ప్రతిభను ప్రదర్శించారు. వేద విద్యపై ఆసక్తి కలిగిన విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనడం సంతోషకరమని ఆశ్రమ పీఠాధిపతి అవధూత గిరి మహారాజ్, సిద్దేశ్వరానందగిరి మహారాజ్ పేర్కొన్నారు. త్వరలోనే మరో విడత మౌఖిక పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఈ పరీక్షలు రాజయోగ ఆశ్రమ పీఠాధిపతి రాచయ్య స్వామి, నందిని గిరి, పర్యవేక్షణలో జరిగింది. అన్ని వర్ణాల వారు వేద విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 639258008, 9177259329 లేదా నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

## తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యునిగా పోసనబోయిన హుస్సేన్



హుజూర్ నగర్, జూన్ 23, (వాయిస్ టుడే ప్రతినిధి) ఈనెల ,20 21,22 తేదీలలో మహ బూబ్ నగర్ జిల్లాలో జరిగిన తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాలుగవ మహాసభల్లో సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ నుండి పోసన బోయిన హుస్సేన్ ను రాష్ట్ర కమిటీ సభ్యునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పోసనబోయిన హుస్సేన్ మాట్లాడుతూ సూర్యాపేట జిల్లాలో శ్రమజీవులు కార్మికులు కర్షకులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహించి జిల్లాలో వ్యవసాయ కార్మిక ఉద్యమాన్ని బలోపేతం చేస్తామని అన్నారు అణిచివేయబడుతున్న అణగారిన ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడుతూ పేద ప్రజల గుండెచప్పుడుగా ప్రజల గొంతుకగా వ్యవసాయ కార్మిక సంఘం నిలుస్తుందని అన్నారు. శ్రమ దోపిడీకి బానిసత్వానికి కుల వివక్షతకు గురవుతున్న కార్మికులను కర్షకులను సంఘటితం చేసి కార్మిక కర్షక మైత్రి కోసం కృషి చేస్తామని తెలియజేశారు. దళితులు గిరిజనులు బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఎలాంటి కష్టం వచ్చిన వ్యవసాయ కార్మిక సంఘం ఎర్రజెండా అండగా ఉంటుందని తెలియజేశారు. నా ఉద్యమ ప్రస్థానంలో ప్రత్యక్షంగా పరోక్షంగా సహకరిస్తున్న శ్రేయోభిలాషులకు మేధావులకు అభ్యుదయ వాదులకు ప్రజాతంత్ర వాదులకు పాత్రికేయ మిత్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు.

# సీఎంఆర్ సరఫరాలో భారీ అక్రమాలు బట్టబయలు.. ఇద్దరు రైస్ మిల్లర్లు అరెస్ట్!

**ఏడు కోట్ల ప్రభుత్వ సొమ్ము స్వాహా!**

**ఇండస్ట్రీస్ పేరుతో మహా దోపిడీ**

**రాష్ట్రంలో 150 కోట్ల స్కాం**

**చాకచక్యంగా నిందితులను పట్టుకున్న పోలీసులు**



సుల్తానాబాద్, పెద్దపెల్లి జిల్లా జూన్-23 (వాయిస్ టుడే): ఇండస్ట్రీల పేరుతో కోట్ల రూపాయలు దండుకుంటూ తప్పించు తిరుగుతున్న ఇద్దరు రైస్ మిల్లర్లను సుల్తానాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం సుల్తానాబాద్ పోలీస్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీసీపీ భూక్య రామ్ రెడ్డి వివరాలను వెల్లడించారు. కరీంనగర్ కట్టరాంపూర్ భగత్ నగర్ కు చెందిన సౌభాగ్య లక్ష్మి ఇండస్ట్రీస్ మేనేజర్ బండారి మారుతీ, అతని భాగస్వామిగా ఉన్న సౌఖ్యం అంజయ్యలు హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం కన్నూరు గ్రామం నివాసిలు. వీరిద్దరూ కలిసి తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల జిల్లా మేనేజర్ ముప్పిడి శ్రీకాంత్ తో సీఎంఆర్ ధాన్యం ఒప్పందాన్ని కుదుర్చుకొ ని, రెండు వేల ఇరవై మూడు సంవత్సరంలో 3116.360 మెట్రిక్ టన్నులు,రెండు వేల ఇరవై నాలుగు లో 2119.125 మెట్రిక్, టన్నుల బియ్యం ప్రభుత్వానికి అందించాల్సి ఉండగా, నిధుల దుర్వినియోగం, అక్రమ వి క్రయాలకు పాల్పడ్డారని తెలిపారు. కేవలం 515.558 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రభుత్వానికి అందించి, మిగతా 1603.967 మెట్రిక్ టన్నుల సిఎంఆర్ బియ్యాన్ని డెలివరీ చెయకుండా ఎగనామం పెట్టారన్నారు. బ్యాంకుల వద్ద రైస్ మిల్లుల పేరుతో అప్పులు తీసుకోవడం, సివిల్ సప్లై అధికారులకు తెలియకుండా ప్రభుత్వ ధాన్యాన్ని నిందితులు బహిరంగం మార్కెట్లో విక్రయిస్తున్నారన్నారు.రెండు వేల ఇరవై రెండు వేల ఇరవై ఐదు సంవత్సరంలో హైదరాబాద్ టాస్క్ ఫోర్స్ అధికారులతోపాటు పెద్దపెల్లి జిల్లా పౌరసరఫరాల అధికారులు నిల్వల తనిఖీలలో 1088.014 వరి ధాన్యం తక్కువ ఉన్నట్లు విచారణలో అధికారులు గుర్తించారు. బాధితుడి అభ్యర్థన మేరకు తొంబై రోజులతోపాటు మరో మూడు నెలల గడువు ఇచ్చిన, ఇద్దరు నిందితులు అధికారులను నమ్మించి ఏడు కోట్ల నష్టం చేశారని తెలిపారు.గతంలో బండారి మారుతి రాష్ట్రంలోని వివిధ జిల్లాలలో ఇదే తరహాలో మోసాలకు పాల్పడ్డారని తెలిపారు. సీతారామ ఆగ్రో ఇండస్ట్రీస్, శ్రీరాములపల్లి, ప్రభుత్వానికి అరవై తొమ్మిది కోట్ల మోసం చేశారని, మహాశక్తి ఇండస్ట్రీస్ కోరపల్లి కి అరవై రెండు కోట్లు, సాయి మహాలక్ష్మి ఇండస్ట్రీస్ కాట్నపల్లికి ఇరవై కోట్లు, మోసం చేశారని అన్ని కలిపి మొత్తం రాష్ట్రవ్యాప్తంగా నూట యాభై ఎనిమిది కోట్ల ప్రభుత్వ సొమ్మును పక్కదారి పట్టించి, సివిల్ సప్లై సంస్థను, ప్రభుత్వాన్ని మోసం చేసినట్లు నిర్ధారణకు వచ్చారు.బండారి మారుతిపై గతంలో వివిధ పోలీస్ స్టేషన్లలో మర్డర్ కేసు, అటెంప్ట్ మర్డర్, మోసాలు తదితర కేసులు నమోదై ఉన్నాయని తెలిపారు. నిందితులు బండారి మారుతి, సౌఖ్యం అంజయ్య కోసం గాలింపు చర్యలు చేపట్టుతుండగా సోమవారం కరీంనగర్ కట్టరాంపూర్ జిమ్ములో ఇద్దరు నిందితులను సుల్తానాబాద్ సిఐ రంజిత్ రావు ఆధ్వర్యంలో ఎస్ఐలు చాక చక్యంగా పట్టుకొని సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. కేసు నమోదు చేసి ఇద్దరు నిందితులను రిమాండ్ కు తరలిస్తున్నట్లు డిసిపి రామ్ రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో ఏసీబీ గజ్జి కృష్ణ, సీఐ రంజిత్ రావు, సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు చంద్రకుమార్, మధుకర్, మల్లేష్, సనత్ రెడ్డి అదనపు ఎస్సై అశోక్ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా బానావత్ తిరుపతి నాయక్



రాయికల్ ( వాయిస్ టుడే): భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు జగిత్యాల జిల్లా బీజేపీ ఎస్టీ మోర్చ జిల్లా అధ్యక్షుడిగా రాయికల్ మండలం ధావన్ పల్లి కి చెందినబానావత్ తిరుపతి నాయక్ ను . నియమించారు ఆయన గతంలో నియోజకవర్గ భాజపా మండల ఇంచార్జీ గా పనిచేసి ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేశారు.



## విద్యార్థులు యాంటీ డ్రగ్ సోల్జర్స్ గా మారాలి!

**మత్తు పదార్థాలకు దూరంగా, లక్ష్యానికి దగ్గరగా ఉండాలి: పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**

సుల్తానాబాద్, పెద్దపెల్లి జిల్లా జూన్-23 (వాయిస్ టుడే) :మత్తు పదార్థాలకు దూరంగా ఉంటేనే విద్యార్థులకు బంగారు భవిష్యత్ ఉంటుందని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జూన్ ఇరవై రెండు నుంచి ఇరవై ఆరు వరకు నిర్వహిస్తున్న మాదకద్రవ్యాల నిర్మూలన అవగాహన వారోత్సవాల్లో భాగంగా మంగళవారం గర్రెపల్లి సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సుల్తానాబాద్ సీఐ రంజిత్ రావు, ఎస్సై చంద్రకుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పోలీస్ కమిషనర్ హాజరై, ఈ సందర్భంగా మాట్లాడుతూ, పాఠశాలలో విద్యార్థులు క్రమశిక్షణతో ఉండటం అభినందనీయమని, మంచి విలువలు క్రమశిక్షణ ఉన్న విద్యార్థులు ఎప్పటికీ మత్తు పదార్థాల బారిన పడరని పేర్కొన్నారు. ఇందుకు కృషి చేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను అభినందించారు.విద్యార్థులు చదువుతో పాటు బాధ్యతాయుత పౌరులుగా వ్యవహరించాలని, తమ గ్రామాలు, కాలనీలు, పరిసర ప్రాంతాల్లో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పిస్తూ 'యాంటీ డ్రగ్ సోల్జర్స్'గా ముందుండాలని పిలుపునిచ్చారు. మత్తు పదార్థాలు ఆకర్షణీయంగా కనిపించినప్పటికీ, తర్వాత వ్యసనంగా మారి వ్యక్తి ఆరోగ్యం, భవిష్యత్తును తీవ్రంగా దెబ్బతీస్తాయని హెచ్చరించారు. మాదకద్రవ్యాల వల్ల శారీరక, మానసిక సమస్యలతో పాటు కుటుంబాలు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటాయని తెలిపారు. విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లోనూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలని, క్రమశిక్షణ, అంకితభావం, నిరంతర శ్రమతోనే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని అన్నారు. లక్ష్యంపై దృష్టి సారిస్తే ప్రతి విద్యార్థి జీవితంలో విజయాన్ని సాధించగలడని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ సిఐ రంజిత్ రావు పెద్దపల్లి నార్కోటిక్ టీం ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, జూలపల్లి ఎస్సై మల్లేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుంది

**ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు**

**రైతు వేదికలో సన్న వరి విత్తనాల పంపిణీ కార్యక్రమం**



సుల్తానాబాద్, పెద్దపల్లి జిల్లా జూన్-23 (వాయిస్ టుడే) : రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు అన్నారు. సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామంలోని రైతు వేదికలో వానాకాలం సీజన్ సందర్భంగా నిర్వహించిన విత్తన మేళా, రైతు ముంగిట్లో నాణ్యమైన విత్తనాల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి, సబ్సిడీపై రైతులకు సన్న వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు సకాలంలో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు సన్న వడ్లకు క్వింటాల్ కు ఐదు వందల రూపాయలు బోనస్ అందజేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇందుకోసం సుమారు రూ.1,750 కోట్ల నిధులు కేటాయించగా, పెద్దపల్లి నియోజకవర్గ రైతుల ఖాతాల్లో ఎనభై ఎనిమిది కోట్ల నలభై లక్షల బోనస్ జమ చేసినట్లు వెల్లడించారు.గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని ఆరోపించిన ఆయన, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు మేలు చేసే విధంగా ఏడు రకాల ఉత్తమ పంట రకాలను ఎంపిక చేసి ప్రోత్సహిస్తుంటే విపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. అలాగే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వరి, మొక్కజొన్న, కందులు వంటి పంటల కొనుగోళ్లలో రైతులకు సరైన మద్దతు ఇవ్వడం లేదని అన్నారు.అంతర్జాతీయ మార్కెట్ అవసరాలు, ఎగుమతి అవకాశాలను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ నిపుణుల సూచనల మేరకు సాంబ మసూరి బీపీటీ , తెలంగాణ సోన, హెచ్ఎంటీ సోన, జై శ్రీరామ్, కూనారం సన్నలు 1638 వరంగల్-4444 సిద్ధి , కేఎన్ఎం-7715 రకాల సన్న వడ్ల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని తెలిపారు. ఈ రకాలకే పూర్తి బోనస్ వర్తిస్తుందని స్పష్టం చేశారు. రైతులు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, సేంద్రీయ ఎరువుల వినియోగంపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, గ్రామ సర్పంచ్, వ్యవసాయ శాఖ అధికారులు, సుల్తానాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, వార్డు సభ్యులు, రైతులు, గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**